
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

సోమవారం 31 మార్చి 2025



6

కర్ణాటక నుంచి మిర్చి తెస్తున్న **వ్యాపారస్థులు**

- రైతుల పేర్లతో మిర్చియార్డులో విక్రయం
- రికార్డుల్లో రొటేషన్ అవుతున్న కొందరి పేర్లు
- రైతుల మిర్చిని మాత్రమే కొనుగోలు చేయాలని మంత్రి ఆదేశాలు

శ్రీవిశ్వావసుకు ఘన స్వాగతం

- కళకళలాడిన దేవాలయాలు
- సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన యువత
- వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉత్సవాలు
- హాజరైన ఎమ్మెల్యేలు, మేయర్, కమిషనర్
- పలువురు అర్చకులకు ఘన సత్కారం



ఉగాది ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యేలు నసీర్, రామాంజనేయులు, కమిషనర్, కె.బి శ్రీనివాస్ తదితరులు



అర్చకులను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు, కమిషనర్

గుంటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ అత్యంత భక్తి శ్రద్ధలతో జిల్లా అంతటా జరుపుకున్నారు. మామిడి తోరణాలతో ఇళ్లను అలంకరించి.. సంప్రదాయ వస్త్రధారణతో చిన్నా.. పెద్దా ఆకట్టుకున్నారు. షడ్రుచుల సమ్మేళనం తో ఉగాది పచ్చడిని రుచి చూశారు. ఇష్టదైవాన్ని దర్శించుకుని పూజలు చేశారు. కొత్త ఆశలు.. ఆశయాలతో షడ్రుచుల సమ్మేళనాలతో మార్పును స్వాగతిస్తూ విశ్వావసును జిల్లా ప్రజలు ఘనంగా స్వాగతించారు. షడ్రుచులతో వేప పచ్చడి తయారు చేసుకొని ప్రీతిపాత్రంగా స్వీకరించారు. పురుషులు పంచెకట్టు, మహిళలు పట్టు వస్త్రాలు, యువతులు పట్టు పరికిణీలు ధరించి ఉగాది పండగని మరింత ద్విగుణీకృతం చేశారు. పూజ సామాగ్రి కొనుగోళ్ల కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో మార్కెట్లు, వ్యాపార కూడళ్లు కళకళలాడాయి. రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఉగాది వేడుకలు స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జిల్లా ఉన్నతాధికారులు, మంత్రులు అమరావతి రాజధాని వెలగపూడిలో పీ4 కార్యక్రమం ఏర్పాట్లలో నిమగ్నం కావడంతో అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ ప్రజలందరికి శ్రీ విశ్వావసు నామ ఉగాది అందరికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వరాలు అందించాలని, అందరికి శుభం జరగాలని ఆకాంక్షించారు. ఉగాది సంతోషాన్ని అందరికీ పంచాలన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అట్టడుగు వర్గాలకు మేలు చేసేలా వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. అందరి సంకల్పాలు నెరవేరి రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధిలో మరింతగా ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నామన్నారు.

అనంతరం గుదిమెళ్ల శ్రీకూర్మనాధస్వామి, అర్చకులు షణ్ముఖ రఘు కిషోర్ శర్మ, గంజాం రాధాకృష్ణమాచార్యులు, జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి, వేద పండితుడు చింతపల్లి నరసింహమూర్తి, వివిధ రంగాల్లో ప్రముఖులు సాంబశివరావు, భట్టు సిదానంద శాస్త్రి, మండవ నరిసింహారావు, గోగినేని రామారావు, హాజీ బేగ్ సాహెబ్, సయ్యద్ జానీ బాషా, కోల్లా వీరయ్య చౌదరి, కవులు డాక్టర్ రావి రంగారావు, షేక్ ఖాసింబీ, డాక్టర్ నల్లాన చక్రవర్తుల సుధామైథిలీ, చల్లా సత్యవతి రెడ్డి, గడల శివప్రసాద్ షేక్ అన్మతున్నీసా బేగం, నూతక్కి ప్రజ్ఞాచారి, ఏవీకే సుజాత, జానీ బాషా, బొమ్మ మహేశ్వర రెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవల్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్, స్టెప్ సీఈఓ చంద్రమౌళి, జిల్లా టూరిజం అధికారి రమ్య, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనరు కేబీ శ్రీనివాసులు, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు ఓబులేషు, నగరపాలక సంస్థ పీవో రామారావు, ఈఈ సుందరరామిరెడ్డి, కార్పొరేటర్లు, నగర ప్రముఖులు, సాహితీ ప్రియులు, ప్రజలు పాల్గొన్నారు. కార్పొరేటర్లు పాల్గొన్నారు. అనంతరం కవిసమ్మేళనంలో కవులు ఉగాది కవితలు వినిపించారు. కాగా ఉగాది వేడుకలు గుంటూరు జిల్లాలోని ప్రముఖ దేవాలయాలైన వైకుంఠపురం(తెనాలి), మంగళగిరి లక్ష్మీనృసింహ స్వామి ఆలయం, పొన్నూరులో భావన్నారాయణ స్వామి ఆలయంతో పాటు అన్ని దేవాలయాల్లో ఘనంగా జరిపారు. పెదకాకాని శివాలయంలో శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఆలయాలను సందర్శించి తమ ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని ఆ దేవదేవుళ్లను ప్రార్థించారు. చరవాణిలో సామాజిక మాధ్యమాల ద్వారా ఉగాది శుభా కాంక్షలను తమ బంధువులు, స్నేహితులకు తెలియ జేశారు.



విద్యార్థినుల నృత్యం



గార్డెన్స్ వెంకన్న సన్నిధిలో భక్తులకు ఆశీర్వాదం

నేడు రంజాన్



- మసీదులు ముస్తాబు
- ఈద్గాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు

గుంటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వినీలాకాశంలో నెలవంక ఆవిష్కృతమైంది. ఆదివారం సాయంత్రం నెల పొడుపు కనిపించగానే ముస్లిం సోదరులు ఆనందంతో పరవశించిపోయారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొంటూ ఈద్ ముబారక్ (శుభాకాంక్షలు) తెలుపుకున్నారు. జిల్లాలోని అన్ని మసీదులలోనూ ఈద్ ముబారక్‌ని తెలియజేస్తూ రంజాన్ పండగని సోమవారంగా ప్రకటించారు. దీంతో గుంటూరు నగరంలో వేలాది మంది ముస్లిం సోదరులు హాజరై ప్రార్థనలు నిర్వహించే అంజుమన్ కళాశాల(పొన్నూరు రోడ్డు), నగరంపాలెం, లాంలోని ఈద్గాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఉదయం ఆయా ఈద్గాలలో వేల సంఖ్యలో ముస్లింలు హాజరై ప్రార్థనలు నిర్వహించనుండటంతో వాటి వద్ద పారిశుద్ధ్యం, తాగునీరు తదితర ఏర్పాట్లను నగరపాలకసంస్థ చేస్తున్నది.

రంజాన్ పండగని ముస్లింలు ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఈ ఏడాది కూడా నెల పాటు కఠోర నియమాలు పాటించారు. వేకువజామునకు ముందే ఆహార, పానీయాలను ముగించుకొని ఉపవాసమాచరించారు.. రోజుకు ఐదుసార్లు మసీదులకు వెళ్లి నమాజ్ చేశారు. సాయంత్రం వేళ ఉపవాసాలు ముగించి ఇఫ్తార్‌లో పాల్గొని తమకు తోచినంత సాయాన్ని పేదలకు చేశారు. రంజాన్ పండగ దృష్ట్యా ఆదివారం ముస్లింల షాపింగ్‌లతో వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి.

ప్రార్ధనలకు ప్రత్యేక ఏర్పాట్లు

పవిత్ర రంజాన్ ప్రార్థనలకు నగరంలో మసీదులు, ఈద్గాలు సిద్ధమయ్యాయి. ముస్లిం సోదరుల ప్రార్థనల కోసం ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా అంజుమన్ ఈ ఇస్లామియా సంస్థకు చెందిన నగరంలోని నగరంపాలెంలో ఈద్గా వద్ద ఏర్పాట్లు చేశారు. వేసవికి టెంట్‌లు, మంచి నీరు సౌకర్యాలు, కూర్చొని ప్రార్థనలు చేసుకునేందుకు కింద కార్పెట్లు సిద్ధం చేశారు. పొన్నూరు రోడ్డు ముస్లిం కళాశాల ఆవరణలోని ఈద్గాలో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, కళాశాల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభానీలు ఏర్పాట్లను పరిశీలించారు. ముస్లిం సోదరుల ప్రార్థనలకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన చోట కూలర్లును కూడా ఏర్పాటు చేశారు. ఇక నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల్లోని పట్టాభిపురం, ఎత్తురోడ్డు సెంటర్, పొన్నూరు రోడ్డు, మాయబజారు ప్రాంతాల్లో ఉన్న మసీదులకు రంగు రంగుల విద్యుద్దీప కాంతులతో కొత్త కళ తీసుకొచ్చారు. మరో వైపు ముస్లిం యువత షాపింగ్‌ల కొనుగోళ్ళతో నగరంలో రంజాన్ సందడి కనిపించింది.



నగరంపాలెం ఈద్గా వద్ద రంజాన్ ఏర్పాట్లు



విద్యుత్ అలంకరణలో నల్లచెరువు ఎత్తు రోడ్డు సెంటర్ వద్ద మసీదు

రూ.15 కోట్లతో.. అక్షయ పాత్ర కమ్యూనిటీ కిచెన్

- శంకుస్థాపన చేసిన ఎంపీ లావు.. ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) కేసానుపల్లి ఎంఏఎం కళాశాల వద్ద అక్షయ పాత్ర ఫౌండేషన్ వారి 80వ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. రూ.15 కోట్ల వ్యయంతో ఈ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం చేపడు తున్నారు. ఈ కిచెన్ ద్వారా పల్నాడు పరిసర ప్రాంతాల్లోని 15,000 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రుచికరమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించడంతో పాటు, అన్న క్యాంటీన్లకు ఆహారం పంపిణీ కూడా చేయనును న్నారు. భూమి పూజల్లో పాల్గొన్న టీడీపీ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కొన్ని సంవత్సరా లుగా పల్నాడు జిల్లాలో అక్షయ పాత్ర ఫౌండేషన్‌ను స్థాపించేందుకు ఎంతో కృషి చేశామన్నారు. ప్రభుత్వం, దాతల మద్దతుతో ఈ రోజు 80వ కమ్యూనిటీ కిచెన్‌కు భూమి పూజ నిర్వహించడం ఆనందంగా ఉంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవింద్ బాబు, జేసీ సూరజ్ ధనుంజయ్, అక్షయ పాత్ర ఫౌండేషన్, హరే కృష్ణ మూమెంట్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీ య అధ్యక్షుడు వంశీధర దాసు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



పేదరిక నిర్మూలనకు.. ఉక్కు సంకల్పం

- పీ-4పై సర్వత్రా సానుకూల స్పందన
- విజయవంతమైన సభ
- దిశానిర్దేశం చేసిన చంద్రబాబు
- మార్గదర్శకులకు సూచనలు...
- బంగారు కుటుంబాలకు భరోసా
- రెండు కుటుంబాలతో సీఎం ముఖాముఖి



మాట్లాడుతున్న కురగల్లుకు చెందిన కడియం నరహరి కుటుంబ సభ్యులు

మంగళగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ ఆంధ్ర - 2047 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలన్న ఆశయాన్ని చేరుకుంటామని పీ-4 సభ ప్రతిజ్ఞ పూనింది. సున్నా పేదరికం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వెలగపూడి సచివాలయం వద్ద ఆదివారం సాయంత్రం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేసిన పీ-4 సభ విజయవంతమైంది. తొలుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాన్ని ఆరంభించారు. ఆ తరువాత పీ-4 పథకానికి సంబంధించిన లోగోను చంద్రబాబు పవన్‌కళ్యాణ్‌తో కలిసి సంయుక్తంగా ఆవిష్కరించారు. అటు తరువాత పీ-4 తాలూకు రాష్ట్రప్రభుత్వం రూపొందించిన పోర్టల్‌ను కూడ చంద్రబాబు రిమోట్‌తో ఆరంభించారు. ఈ సందర్భంగా మార్గదర్శకులుగా ముగ్గురు దిగ్గజ వ్యాపారవేత్తలను, మంగళగిరి, విజయవాడకు చెందిన రెండు పేద కుటుంబాలవారిని బంగారు కుటుంబాలుగా ఎంచుకుని వేదికపైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పేదరికం నిర్మూలన లక్ష్యంగా ఇక్కడ తాము ఉక్కు సంకల్పాన్ని తీసుకుంటున్నామని ప్రకటించారు. నా మిత్రుడు పవన్‌కళ్యాణ్, ప్రధాని మోదీ ముగ్గురం కలిసి ఈ లక్ష్యాన్ని సాధించి తీరుతామని ఉద్వేగంగా అన్నారు. రాష్ట్రంలో సున్నా పేదరికం లక్ష్యంగా తనకున్న నిర్దిష్టమైన ఆలోచనలను ఈ వేదిక సాక్షిగా ప్రజలముందర పెడుతున్నానని చెప్పారు.

ఈ కార్యక్రమానికి బంగారు కుటుంబాలుగా ఎంచుకున్నవారిలో మొదట మంగళగిరి పాత రూరల్ మండలం కురగల్లుకు చెందిన కడియం నరసింహ, వెంకట సుశీల దంపతులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారితో నేరుగా సంభాషిస్తూ కుటుంబ స్థితిగతులను గురించి విచారించారు. ముఖ్యమంత్రి అడిగిన ప్రశ్నలకు నరసింహ సమాధానమిస్తూ తాను గొర్రెలు కాచుకుని జీవనం సాగిస్తున్నట్టు తెలిపాడు. తనకు భార్య, ఇద్దరు పిల్లలు, వృద్ధులైన తల్లీదండ్రులు ఉన్నారన్నారు. పదవ తరగతి చదువుతున్న తన కుమారుడ్ని సివిల్ ఇంజనీరుగా చూడాలన్న కోరిక తనకు బలంగా ఉందన్నారు. కుమార్తె ఎనిమిదవ తరగతి చదువుతుందన్నారు. నెలకు ఎంత సంపాదిస్తావంటూ సీఎం అడుగగా...తనకు నెలనెలా జీతం రాదని, మూడు మాసాలకు ఓసారి పెంచిన గొర్రెలలో ఒకదానిని అమ్మి రూ 20 వేల వరకు సంపాదిస్తానని తెలిపారు. భార్య వెంకట సుశీల పూల తోటలలో పూలు కోస్తూ రోజుకు రూ వందనుంచి రెండొందల వరకు సంపాదిస్తుందని చెప్పారు. తనకు మెరుగైన ఉపాధికి సాయమందించడంతోపాటు తన బిడ్డలను చదివించాలని నరసింహ అభ్యర్థించాడు. ఈ సందర్భంగా చంద్రబాబు సూచనల మేరకు మార్గదర్శి గ్రీన్‌గో కంపెనీ యజమాని చలమలశెట్టి అనిల్‌కుమార్ స్పందిస్తూ ఆ కుటుంబానికి తాను అండగా వుంటానని హామీనిచ్చారు. ఇది తనకో గొప్ప అవకాశమని గతంలో సీఎస్ఆర్ కింద కొన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించినప్పటికీ...తనకు సంతృప్తి కలగలేదన్నారు. పీ-4 పేరుతో ఏర్పాటుచేసిన ఈ ప్లాట్‌పారం చాల గొప్పదిగా తాను భావిస్తున్నట్టు చెప్పారు.

> చంద్రబాబు మాట్లాడుతూ పీ-4లో తొలిదశగా 30 లక్షల కుటుంబాల వారిని ఆర్థికంగా సామాజికంగా పైకి తీసుకురావాలన్నారు. మార్గదర్శకులు డబ్బులు ఇవ్వడమొక్కటే లక్ష్యంగా పెట్టుకోకుండా తాము బాధ్యత తీసుకున్న కుటుంబాలకు మంచి గైడెన్స్ కూడ ఇవ్వాలన్నారు. వారివారి ఆదాయ పెంపుకు తగిన సలహాలు, సూచనలతోపాటు తగిన అవకాశాలను కూడ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా తాను చిన్నతనంలో ఏడు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకునే వాడినని, వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ తాను ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. అలాగే పేదలకు సాయమందించే విషయంలో ప్రభుత్వాలు ముందుండి పనిచేసినా వారి ఎదుగుదలకు చాల సమయం పడుతుందన్నారు. నిజానికి ఒక జనరేషన్ మిస్ అయ్యేంత సమయం పడుతుందన్నారు. అందుకే తాను బాగా ఆలోచించి పేదరికం నిర్మూలనకు ఈ పీ-4 పథకానికి రూపకల్పన చేశానని చెప్పారు.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 57వ డివిజన్ నుంచి వచ్చిన మరో బంగారు కుటుంబం తాలూకు యజమాని మత్యా ఇమ్మానుయేల్, శారణ్ దంపతులు మాట్లాడుతూ తమ కుటుంబ దీనగాథను సభ ముందుంచారు. ఇమ్మానుయేల్ రాడ్ బెండింగ్ వృత్తిలో వుంటూ కుటుంబపోషణ చేస్తున్నట్టు తెలిపాడు. ఈ కుటుంబ వ్యథ ఆసక్తిగా అనిపించడంతో చంద్రబాబు వారితో ఎక్కువసేపు మాట్లాడారు. ఈ దంపతులకు ఇద్దరు సంతానం వున్నారు. కుమార్తె అలేఖ్య ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసి చదువుతుండగా...కుమారుడు గని ప్రకాష్ పదవ తరగతి వరకు చదివి ప్రస్తుతం తనకు తోడు రాడ్ బెండింగ్ పనికి వస్తున్నట్టు తండ్రి ఇమ్మానుయేల్ వివరించాడు. కుమారుడ్ని ఎందుకు చదివించడం లేదని చంద్రబాబు అడుగగా...తనకు వచ్చే రూ 700లు కుటుంబ పోషణకు సరిపోనందున కుమారుడ్ని చదువు ఆపించి తనతోపాటు కూలీపనికి తీసుకువెడుతున్నట్టు చెప్పాడు. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందని అడుగగా కుమార్తె అలేఖ్యను మెడిసన్ చేయించాలన్న పట్టుదలతో తమ కుటుంబమంతా కలిసి ఆలోచించుకుని ఈ నిర్ణయం తీసుకుందని భార్యాభర్తలు సమాధానమిచ్చారు. కొడుకును చదివించలేక పోతున్నామన్న బాధ నీకు లేదా? అంటూ సీఎం చంద్రబాబు శారణ్‌ను ప్రశ్నించగా ఆమె కళ్లనీళ్ల పెట్టుకున్నారు. మీ తండ్రి మీ అక్కను చదివిస్తూ నిన్ను కూలీపనికి పంపించడం నీకేమీ కోపాన్ని తెప్పించలేదా అంటూ చంద్రబాబు ప్రకాష్‌ను ప్రశ్నించగా అలాంటిదేమీ లేదని తన తండ్రికి సాయం చేస్తున్నానన్న తృప్తి తనకు వుందన్నారు. అలాగే తమ కుటుంబంనుంచి అక్కను డాక్టర్‌ను చేయాలన్న పట్టుదల తమందరికీ ఉందంటూ ప్రకాష్ చెప్పాడు. ఆ వెంటనే నీవు బైపీసి ఎందుకు తీసుకున్నావని చంద్రబాబు అలేఖ్యను అడుగగా తనకు డాక్టర్ కావాలనే కోరిక బలంగా ఉందన్నారు. డాక్టరే కావాలని ఎందుకనుకుంటున్నావని అడుగ్గా తమ పేద కుటుంబాల వారికి ఉచితంగా వైద్యసాయం అందించాలన్న లక్ష్యంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నానని అలేఖ్య చంద్రబాబుకు వివరించింది. దీంతో చంద్రబాబు ఆమెను అభినందిస్తూ పేదలలో పుట్టినంత మాత్రాన మంచి ఆశయాలు వుండకూడదన్న రూలేమీ లేదన్నారు. అనంతరం మార్గదర్శిగా జైరాజ్ స్టీల్ కంపెనీ యజమాని సజ్జన కుమార్ గోయంకా స్పందిస్తూ అలేఖ్యను తాను మెడిసన్ చదివించగలనని హమీనిచ్చారు.

మరో మార్గదర్శి మేఘా ఇంజనీరింగ్ కంపెనీ యజమాని పీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ డిసెంబరు 14న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పీ-4 పథకాన్ని గురించి తొలుత ప్రకటించారన్నారు. ఇది కచ్చితంగా ఓ గేమ్ ఛేంజర్‌గా నిలబడుతుందన్నారు. పేదరికాన్ని నిర్మూలించాలన్న కాంక్ష సీఎం చంద్రబాబులో చాల బలంగా ఉందన్నారు. చంద్రబాబు సూచనతో తాను కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలాన్ని దత్తత తీసుకుని దాని సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని చెప్పారు. తాను వ్యాపారపరంగా 20 దేశాలు, 20 రాష్ట్రాలలో తిరుగుతుంటానని...కానీ ఈ ప్రభుత్వం మాదిరి ప్రజలకు ఏదో మేలు చేయాలన్న తపన ఎక్కడా ఇంత బలంగా కనిపించలేదని చెప్పారు. ఈ సభా కార్యక్రమానికి ప్రముఖ టీవీ యాంకర్ ఝాన్సీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్

తెలుగు వైభవాన్ని ముందు తరాలకు అందించాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్
- వైభవంగా సాహితీ వసంతోత్సవం

6



కురగల్లుకు చెందిన కడియం నరహరి కుటుంబ సభ్యులతో ఒకే టేబుల్ వద్ద కూర్చుని ముచ్చటిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం



ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, వేదికపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

ఆదివాసీలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలి

పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్



సభలో ప్రసంగిస్తున్న పౌరహక్కుల సంఘం కార్యదర్శి చంద్రశేఖర్

మంగళగిరి సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలపై జరుగుతున్న రాజ్య హింసకు వ్యతిరేకంగా పోరాడాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర స్థాయి సభ మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణభవన్‌లో ఆదివారం జరిగింది. ఎస్కే నాగూర్‌వలి అధ్యక్షతన జరిగిన ఈ సభలో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్‌లో గత ఏడాది నుంచి పోలీసులు చేస్తున్న ప్రతి ఎన్‌కౌంటర్ బూటకమని పేర్కొన్నారు. కేవలం ద్రౌపది ముర్ము లాంటి వ్యక్తులను రాష్ట్రపతిగా చూపించి ఆదివాసీలపై బూటకపు ప్రేమను కనబరుస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరిపి కాల్పుల విరమణ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక కార్య దర్శి పొనుగోటి కృపాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ ప్రశ్నించే వ్యక్తులపై దాడులు, హత్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు బలమైన ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో పౌరహక్కుల సంఘం నేతలు కోటేశ్వరరావు, గోపీనాథ్, మంజు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక నుంచి మిర్చి తెస్తున్న వ్యాపారస్థులు

- రైతుల పేర్లతో మిర్చియార్డులో విక్రయం
- రికార్డుల్లో రొటేషన్ అవుతున్న కొందరి పేర్లు
- రైతుల మిర్చిని మాత్రమే కొనుగోలు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు



గుంటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కొంతమంది వ్యాపారస్థులు రైతుల ముసుగు ధరిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో మిర్చి క్వింటాల్ ధర రూ. 6 వేలు మాత్రమే ఉండటంతో అక్కడి రైతుల వద్ద కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొస్తున్నారు. యార్డులో వ్యాపారస్థులు మిర్చిని అమ్మడానికి వీలు లేకపోవడంతో కొంతమంది రైతుల ఆధార్‌లు, వారి బ్యాంకు అకౌంట్ల వివరాలు తీసుకుని వాళ్ల పేర్లతో మిరపకాయలను అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు. గత కొద్ది రోజుల నుంచి కర్ణాటక నుంచి ఎక్కువ మోతాదులో మిర్చి ఇక్కడికి దిగుమతి అవుతుండడానికి ఇదొక కారణంగా మార్కెటింగ్ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తీసుకొచ్చే మిర్చిని మాత్రమే యార్డులోకి అనుమతించాలని సిబ్బందికి నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, హుబ్లీ, హోస్‌పేట, రాయ్‌చూర్ వంటి ప్రాంతాల్లో మిర్చి ధర భారీగా పతనమైంది. అక్కడి మార్కెట్ కమిటీల్లో మిర్చి క్వింటాల్ ధర రూ.6 వేలు మాత్రమే ఉన్నది. ఈ విషయాన్ని తెలుసుకొన్న కొంతమంది వ్యాపారస్థులు నేరుగా అక్కడికి వెళ్లి రైతుల వద్ద మిర్చిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఆ మిర్చిని గుంటూరు మార్కెట్ కమిటీకి తరలించి రైతుల పేర్లతో కమీషన్ దుకాణాల వద్ద దిగుమతి చేస్తున్నారు. అక్కడి నుంచి వస్తున్న మిర్చిలో నాణ్యత ఏమాత్రం ఉండటం లేదు. తేమ, తాలు శాతం అధిక మోతాదులో ఉంటున్నాయి. దీంతో ఇక్కడి ఎగుమతిదారులు క్వింటాల్‌కి రూ. 8 వేల నుంచి రూ. 9 వేల ధర మాత్రమే చెల్లిస్తున్నారు.

దీని వలన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల రైతులు తీసుకొస్తున్న మిర్చి ధరపై ఆ ప్రభావం పడుతున్నది. అధిక ఎరైవల్స్ కారణంగా మార్కెట్ కమిటీకి వచ్చిన సరుకు అదే రోజు బయటకు వెళ్లిపోవడం లేదు. ఈ కారణంగా కొనుగోళ్లు ఆశాజనకంగా జరగడం లేదు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ. 11,781 కంటే తక్కువకే రైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి. గత కొన్ని రోజులుగా వస్తున్న ఎరైవల్స్‌లో కొంతమంది రైతుల పేర్లు రొటేషన్ అవుతున్నట్లు అధికారవర్గాలు గు ర్తించాయి. ఇదే విషయాన్ని మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నా యుడుకి నివేదించాయి. దీనిపై ఆయన స్పందించి రైతులు తీసుకొచ్చే మిర్చిని మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశించారు. వ్యాపారస్థులు తీసుకొచ్చే మిర్చిని ఎట్టి పరిస్థితుల్లో లోపలికి అనుమతించొద్దన్నారు. మంత్రి ఆదేశాలను ఏమేరకు అమలు చేస్తారో మంగళవారం చూడాలి.

తులసీ రామచంద్రప్రభు సేవలు స్ఫూర్తిదాయకం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ● రూ. 30 లక్షల ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థినికి స్కాలర్‌షిప్పు చెక్కును అందజేస్తున్న పెమ్మసాని, చిత్రంలో తులసీ రామచంద్రప్రభు, యోగీష్‌చంద్ర, కృష్ణచైతన్య తదితరులు

గుంటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తులసీ సీడ్స్ సంస్థల ఛైర్మన్ తులసీ రామచంద్రప్రభు సేవలు స్ఫూర్తిదాయకమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ మేనేజింగ్ ట్రస్టీ తులసీ రామచంద్రప్రభు ఆధ్వర్యంలో రింగ్‌రోడ్డులోని శుభం కన్వెన్షన్‌లో ఆదివారం 570 మంది ప్రతిభ గల పేద విద్యార్థులకు 30 లక్షల రూపాయల ఉపకార వేతనాలను పెమ్మసాని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ రామచంద్రప్రభు ఎటువంటి ప్రత్యక్ష రాజకీయాలలో లేకపోయినా యువతకు విద్య, ఉద్యోగ విషయాలలో తోడ్పడుతూ, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు ప్రభుత్వానికి లక్షల రూపాయలను వెచ్చిస్తున్నారని తెలిపారు. రామచంద్రప్రభు ఆశయాన్ని అర్థం చేసుకుని వారు అందించే ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకుని సమాజానికి మేలు చేయాలని కోరారు. గుంటూరు సర్వజనాసుపత్రికి, మెడికల్ కళాశాల బస్సులకు పది కోట్ల రూపాయలు విరాళంగా ఇవ్వడం చాలా గొప్ప విషయమని ప్రభు సేవలను ఆయన కొనియాడారు. తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ తాను చదువుకునే రోజులలో కేవలం 16 రూపాయలు పదో తరగతికి పరీక్ష ఫీజు కట్టలేని గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నానని, ఇంటర్, బీటెక్ చదివే రోజుల్లో గవర్నమెంట్ నుంచి వచ్చిన 450 రూపాయలు ఉపకారవేతనాలతో చదువుకుని జీవితంలో స్థిరపడ్డానని గుర్తుచేశారు. తిరిగి సమాజానికి ఇవ్వాలనే ఉద్దేశంతో 1995-96 లో ఇద్దరు విద్యార్థులతో మొదలుపెట్టి నేటికి 36 వేల మంది విద్యార్థులకు రూ. 22 కోట్ల ఉపకారవేతనాలుగా పంపిణీ చేసినట్లు ఆయన తెలియజేశారు. అలాగే 2022, 2023, 2024 సంవత్సరాల్లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ కూడా మొత్తం రూ. 30 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్,అండర్ ప్రివిలేజ్డ్ ట్రస్ట్ ట్రస్టీలు తులసీ యోగీష్ చంద్ర, తులసీ కృష్ణ చైతన్య, నారదాసు శ్రీహరిరావు, మలిశెట్టి సుబ్బారావు, ఉగ్గిరాల సీతారామయ్య, తోట శంకరరావు, తిమ్మిశెట్టి నారాయణరావు, చందనం శ్రీనివాస్, పసుపులేటి రమణయ్య, అంకిరెడ్డి సాంబశివరావు, నారదాసు కోటేశ్వరరావు, జంగాల సాంబశివరావు, మేకల రవీంద్ర, పుచ్చకాయలు ఆనంద్, కనాథం నరేంద్రనాథ్, దళవాయి సుబ్రహ్మణ్యం, మిరియాల శ్రీనివాస్, పంతంగి జనార్దనరావు, తులసి ఆదిత్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లపోటీల్లో గడివేముల జతకు ప్రథమస్థానం



రెండు పళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎడ్లు


తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తెనాలి మార్కెట్ యార్డులో జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో రెండు పళ్ల విభాగంలో నంద్యాల జిల్లా గడివేములకు చెందిన ఎరుమాళ్ల సంజయ్‌కుమార్ ఎడ్ల జత ప్రథమ స్థానం సాధించింది. 10 నిమిషాల సమయంలో 3592 అడుగుల దూరం బండ లాగాయి. ఆదివారం జరిగిన ఈ విభాగంలో 14 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. పల్నాడు జిల్లా ఇస్సపాలెంకు చెందిన వెంకటరామాంజనేయులు ఎడ్ల జత 3228 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం సాధించాయి. బాపట్ల జిల్లా జే పంగులూరుకు చెందిన గొట్టిపాటి రవికుమార్ యాత్, పల్నాడు జిల్లా మాచాయిపాలెంకు చెందిన చెరుకూరి నాగేశ్వరరావు, కార్తీకేయల కంబైన్డ్ ఎడ్ల జత 2979.10 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, ఎన్టీఆర్ జిల్లా మైలవరం సామ్రాజ్యమ్మ బుల్స్ 2821 అడుగులు లాగి నాల్గో స్థానం, బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పోసపాడుకు చెందిన లిఖిత చౌదరి ఎడ్లు 2700 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, బాపట్ల జిల్లా నాగరాజుపల్లికి చెందిన హర్షవర్ధన్ ధనుష్ ఎడ్ల జత 2529 అడుగుల దూరం లాగి ఆరో స్థానం, బాపట్ల జిల్లా మరుప్రోలు వారిపాలెంకు చెందిన వెంకట అయ్యప్ప రెడ్డి గార్లపాడు రైతు చాన్వికచౌదరి కంబైన్డ్ ఎడ్లు 2501 అడుగుల దూరం లాగి ఏడో స్థానం, ఎరుకలపూడి, సంగం జాగర్లమూడి రైతులు శ్రీను, సాత్విక్, రవీంద్రవర్మల ఎడ్లజత 2384 అడుగుల దూరం లాగి 8వ స్థానం, దోనేపూడి రైతు వెనిగళ్ల యజ్ఞశ్రీ ఎడ్ల జత 2342 అడుగుల దూరం లాగి 9వ స్థానంలో నిలిచాయి. విజేతలకు (వరుసగా ప్రథమ నుంచి 9వ స్థానం వరకు) దాతలు పరుచూరి పవన్ రూ.30 వేలు, వంగా సాంబిరెడ్డి రూ.25 వేలు, అమ్మిశెట్టి కిషోర్, తాడికొండ విశ్వేశ్వరరావు రూ.20 వేలు, రేపల్లె సుభాని రూ.15 వేలు, పెమ్మసాని జయప్రకాష్‌రూ.12వేలు, వట్టికూటి ప్రసాద్ రూ.10వేలు, ఫణిదపు దుర్గ రూ.8వేలు, చందోలు పృధ్వీలత రూ.6వేలు, జాస్తి బసవయ్య రూ.5 వేలు బహుమతులు అందజేశారు. మిగిలిన పోటీల్లో పాల్గొన్న జతలకు రూ.5 వేలు బహుమతులు అందించారు. పోటీలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు టీడీపీ నాయకులు పర్యవేక్షించారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

చిలకలూరిపేట, మార్చి30 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా ట్రాక్టర్ నడుపుతూ తిరగబడటంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన చిలకలూరిపేట మండలం రామచంద్రాపురం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జెడ శామ్యూల్(19) ట్రాక్టర్ నడుపుతుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో అతడు ట్రాక్టర్ ఇంజన్ కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట రూరల్ పోలీసులు గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ జీ అనిల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు వైభవాన్ని ముందు తరాలకు అందించాలి

●హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ ● వైభవంగా సాహితీ వసంతోత్సవం



ప్రముఖ సినీ గేయ రచయిత రసరాజుకు సాహితీ పురస్కారం అందజేసి సత్కరిస్తున్న జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, కృష్ణబాబు, పులి శ్రీనివాసులు, సాహితీ సమాఖ్య సభ్యులు

గుంటూరు(తూర్పు), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు ఔన్నత్యాన్ని, వైభవాన్ని ముందు తరాలకు అందించేలా నేటి తరం కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా 28 వసంతాల సాహితీ వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హాజరయ్యారు. సభకు జిల్లా సాహితి సమాఖ్య అధ్యక్షుడు డీవీఎస్‌బీ రామమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు ఇలాంటి వేదికలను ఏర్పాటు చేస్తున్న సాహితి సమాఖ్య కృషి అభినందనీయం అన్నారు. కవి సమ్మేళనాలు మండలస్థాయిలో కూడా నిర్వహించాలని సూచించారు. ఎం టీ కృష్ణబాబు మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ శుభం కలుగుతుందని ఆకాంక్షించారు. రాశి ఫలాలు, ముహూర్తాలు కేవలం అపోహ మాత్రమేనని కష్టం, ప్రయత్నం మనల్ని జీవితంలో గెలిపిస్తుందని అన్నారు. ముహూర్తాలను నమ్మి తెలుగు రాష్ట్రాల్లో 53 శాతం నవ జంటలు శస్త్రచికిత్సల ద్వారా పిల్లలను కంటున్నారని ఇది బాధాకరమన్నారు. ముహూర్తాలపై అపోహలు తొలగించాల్సిన బాధ్యత పండితులపై ఉందన్నారు. మనతోపాటు సమాజం కూడా బాగుండాలనేదే పీ 4 లక్ష్యమని, ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. అంతకు ముందు విష్ణుసహస్రనామ పారాయణం, వేద పఠనం, శ్రీమాన్ గుదిమెళ్ల శ్రీకూర్మనాథ స్వామి పంచాంగ శ్రవణం, ఆర్ సూర్యలక్ష్మీ చే నాదస్వర కచేరి జరిగింది. ప్రముఖ సినీ గేయ రచయిత రసరాజు, సినీ నటుడు కేదార్ శంకర్, వీవీ రామ్‌కుమార్, రచయిత కే కృష్ణవేణి, అష్టావధాని సల్లాన్ చక్రవర్తుల సాహిత్, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం విశ్వావసు నామ సాహితీ పురస్కారం కవి, సినీ గేయ రచయిత రసరాజుకు, ఆత్మీయ సత్కారం ప్రముఖ సినీ నటుడు కేదార్ శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి తదితరులు పాల్గొనగా, కార్యక్రమాన్ని సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు కార్యదర్శి పి.రామచంద్రరాజు పర్యవేక్షించారు.

స్లాట్ తీసుకుంటేనే రిజిస్ట్రేషన్

గుంటూరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ షరీల్ బాబు

గుంటూరు సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో స్లాట్ (ముందస్తు అపాయింట్ మెంట్) బుక్ చేసుకున్న వారు మాత్రమే ఆస్తుల రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉన్నట్లు గుంటూరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ ఎం షరీల్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. ప్రతి రోజు 72 స్లాట్‌లు అందుబాటులో వుంటాయని, ప్రజలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గంటల కొద్దీ సమయం వేచి చూసే పనిలేకుండా సులభంగా రిజిస్ట్రేషన్‌లు చేయించుకునేందుకు కూటమి ప్రభుత్వం ఈ కొత్త పద్ధతిని అమల్లోకి తీసుకువచ్చినట్లు ఆయన వివరించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకోకుండా నేరుగా కార్యాలయానికి వస్తే రిజిస్ట్రేషన్ చేయటం వీలు పడదని తెలిపారు. కావున ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి అందుబాటులో ఉన్న సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ కు రావాలని సబ్ రిజిస్ట్రార్ ఎం షరీల్ బాబు సూచించారు. ఈ విషయాన్ని ప్రజల కు వివరించేందుకు, అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

మద్యం షాపు తొలగించాలని మహిళల నిరసన


తెనాలి క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ముత్తింశెట్టిపాలెంలో ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని ఆదివారం మహిళలు, స్థానికులు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. ఇక్కడికి వచ్చే తాగుబోతుల వల్ల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ మార్గం గుండానే



మద్యం షాపు వద్ద ఎండలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, స్థానికులు

వైకుంఠపురం దేవాలయానికి వెళ్లేవారికి, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, మహిళలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరుకు మార్గం కావడంతో ట్రాఫిక్ అధికంగా ఉంటుందన్నారు. ఇలాంటి ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేసి సమస్యలు సృష్టించవద్దంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు టెంట్‌లు వేసుకుని మహిళలు నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పోలీసుల పహారా మధ్య ఈ ప్రాంత వాసులు రాత్రయినా ధర్నా కొనసాగిస్తూనే ఉన్నారు.

రేపు జాతీయస్థాయి నాటకోత్సవాలు ప్రారంభం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాంతారావు, బ్రహ్మాచార్యులు

తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : 14వ జాతీయ స్థాయి నాటకోత్సవాలు మంగళవారం ప్రారంభమవుతాయని పోస్టల్ ఉద్యోగుల కళా పరిషత్ అధ్యక్షులు డీఎల్ కాంతారావు తెలిపారు. నాటకోత్సవాల కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో దావులూరి సోమశేఖరరావు కళా ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఈ నాటకోత్సవాలు జరుగుతాయన్నారు. నట సార్వభౌమ నందమూరి తారక రామారావు లైఫ్ టైమ్ అచ్చీవ్‌మెంట్ అవార్డును మంగళవారం ప్రముఖ రంగస్థల నటి, రచయిత్రి కె.విజయలక్ష్మికి ప్రదానం చేస్తామని, శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని నాటకోత్సవాలను ప్రారంభిస్తారని చెప్పారు. హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్స్ కళాకారులు జేబు చెప్పిన ఊసులు సాంఘిక నాటిక ప్రదర్శిస్తారని, బుధవారం డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళా పరిషత్ కళాకారులు ది లెసన్ సాంఘిక నాటికను, విశాఖపట్నం సాయి కళానికేతన్ కళాకారులు పౌరాణిక పద్య నాటకం శశిరేఖ పరిణయం ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్కేటింగ్‌లో

హాశిష్‌కు మూడు సిల్వర్ మెడల్స్



అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన హాశిష్

తాడేపల్లి టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తైవాన్‌లోని చైనీస్ తైపీ రోలర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 30 వరకు జరిగిన అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలలో ఇండియా నుంచి తాడేపల్లి పట్టణం డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల హాశిష్ పాల్గొన్నాడు. హాశిష్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ విభాగంలో ఫ్రీ స్టయిల్, ఇన్‌లైన్, సోలో డాన్స్ పోటీలలో తలపడి ఆయా మూడు విభాగాలలో ద్వితీయ స్థానంతో మూడు సిల్వర్ మెడల్స్ సాధించాడు. హాశిష్ గత ఏడాది డిసెంబర్‌లో తమిళనాడు పొలాచ్చిలో జరిగిన రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడు హాశిష్‌ను కోచ్ పీ సత్యనారాయణ, చిట్టిబాబు, రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సీ నీలిమ, పీ శ్రీకాంత్‌లు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

అచ్చంపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఆదివారం పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-20, 15 పురుషులు, స్త్రీల రెజ్లింగ్ ఎంపికలు జరిగినట్టు కార్యదర్శి గుడిపూడి భూషణం తెలిపారు. అండర్ 20 స్త్రీల విభాగంలో గాయత్రి బాయి(సాగర్), కే బ్యూల(వినుకొండ), బీ నేహాస్త్రీ(బ్రాహ్మణ కోడూ రు), ఎం దీపిక భువన(సాగర్), అండర్-20 పురుషుల విభాగంలో కే లాలూనాయక్(రామనీపురం తండా), ఎన్ శ్రీకర్‌ప్రసాదు(గోరంట్ల), టీ సుమంత్(ఆవులవారిపాలెం), ఎస్ బాలకోటేశ్వరరావు(పిడుగురాళ్ళ), పీ విజయ్‌బాబు(ఖాజా), కే కిరణ్(చల్లగరిగ), డీ కుమార్‌బాబు(లగడపాడు), పీ చంటి(బాలెమర్రు), కే భరత్‌కుమార్(రావిపాడు), బీ కళ్యాణ్(గొట్టిపాడు), కే ప్రభాకర్(ఓబులేసునిపల్లె), ఎం అఖిల్(పిడుగురాళ్ళ), అండర్-15 బాలికల విభాగంలో ఎన్ లావణ్య, కే అ నూష, బీ అలేఖ్య, ఎం పూజి త, ఏ పూజిత, ఎస్ మేరీవెన్నెల, డీ స్మృతి, జీ గాయత్రి(సాగర్), అండర్-15 బాలుర విభాగంలో పీ నాగచైతన్య, ఓ గౌరిప్రతాప్, ఏ ప్రణీత్, సీహెచ్ రాంబాబు(అచ్చంపేట), కే ఆదిత్య, వీ పవన్ కుమార్, కే అంకిత్‌రాజు(అడవితక్కెళ్ళపాడు), యూ ఆనంద్ భానుప్రసాదు(దుగ్గిరాల), పీ పునీత్(వరహాపురం)లు ఉన్నారు. ఎంపికైనవారు ఏప్రిల్ 4, 5, 6 తేదీల్లో రాజమండ్రిలో జరగనున్న రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

ముస్లింలకు మంత్రి, ఎమ్మెల్యేల రంజాన్ శుభాకాంక్షలు

గుంటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కఠోర ఉపవాస దీక్షలు ముగించి రంజాన్ పర్వదినాన్ని జరుపుకుంటున్న ముస్లింలకు పలువురు ప్రముఖులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సామరస్యానికి, కరుణ, దాతృత్వాలకు ప్రతీక రంజాన్ మాసమని పేర్కొన్నారు. అందరూ సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో పాదచారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం స్టేషన్‌రోడ్డులోని నూనె నరసింహం ధర్మసత్రం వద్ద దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గం పరిధిలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తి తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత, సత్రం కార్యనిర్వహణాధికారి వేజెండ్ల యజ్ఞనారాయణ, ఫౌండర్ ట్రస్టీ నూనె చంద్రశేఖర్, టీడీపీ నాయకులు సెల్ సత్యం, పోతురాజు చంద్రశేఖర్, దేవదాయ శాఖ ఈవో జక్కా శ్రీనివాస్, సిబ్బంది భాస్కరబాబు, రామ్మోహన్, బీవీ కృష్ణ, ఎంవీ నారాయణ, రామయ్య పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

● నగరంలో శాంతి రుధిర యాత్ర

● పాల్గొన్న పాస్టర్లు, దళిత, మైనార్టీ సంఘాలు

గుంటూరు(తూర్పు), మార్చి 30(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని దళిత, ప్రజా సంఘాలు, పాస్టర్లు డిమాండ్ చేశారు. ఆదివారం గుంటూరులో ఆదివారం క్రైస్తవ, మైనార్టీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో శాంతి రుధిరయాత్ర నిర్వహించారు. తొలుత లాడ్జీ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లాడ్జీ సెంటర్ నుంచి శంకర్‌విలాస్ సెంటర్, హిందు కళాశాల కూడలి, మూడు బొమ్మల సెంటర్ మీదుగా ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల రాజు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి బాధాకరమన్నారు. ప్రవీణ్‌పై దాడి క్రైస్తవంపై దాడిగా భావిస్తున్నట్టు తెలిపారు. ప్రవీణ్ కేసును సీబీఐకి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. నార్త్ ప్యారీస్ బిషప్ ఎస్‌జే బాబురావు మాట్లాడుతూ క్రైస్తవ మిషనరీల ద్వారా దేశంలో పేదలకు విద్య, వైద్య అందిస్తున్న క్రైస్తవ నాయకులుపై, పాస్టర్లపై దాడులు చేయడం బాధాకరమన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో క్రైస్తవులు, మైనార్టీలు ఐక్యంగా ఉండి దాడులను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. అనంతరం వెస్ట్ డీఎస్పీ, ఎస్బీ డీఎస్పీలు అరవింద్, సీతారామయ్యలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత, మైనార్టీ సంఘ నాయకులు కర్రా హనోక్ బెంజిమెన్, నల్లపు నీలంబరం, చిన్నం డేవిడ్ విలియమ్స్, పాస్టర్ జోసఫ్, మార్టిన్ లూథర్ కింగ్, గోళ్లమూడి రాజసుందరంబాబు తదితరులు పాల్గొన్నారు.



శాంతి రుధిర యాత్రలో పాల్గొన్న పాస్టర్లు, విశ్వాసులు, క్రైస్తవ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘ నాయకులు

నేడు శివ కేశవుల విగ్రహ ప్రతిష్ఠ

గుంటూరు కార్పొరేషన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని పట్టాభిపురం వివేకానంద బొమ్మ దగ్గరలోని చంద్రపురంలో శ్రీశ్రీ ముక్తేశ్వర సహిత సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శివ కేశవుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నేడు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9.29 నిమిషాలకు వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగుతాయన్నారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నగరంలో చిన్నబోతున్న పెన్షనర్ల పెద్దరికం

● ఈదర వీరయ్య

గుంటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : నగరంలో యాక్టివ్ ఏజింగ్ విధానాన్ని అమలు చేయకపోవటంతో పెన్షనర్ల పెద్దరికం చిన్నబోతుందని పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షు డు ఈదర వీరయ్య పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ గతానికి వర్తమానికి వారధులు. ప్రశాంత జీవితం గడపాల్సిన సీనియర్ సిటిజన్స్ నగరంలో అడుగడుగునా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిబంధనల ప్రకారం నగరంలో యాక్టివ్ ఏజింగ్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇందులో భాగంగా వృద్ధుల కోసం ప్రత్యేక వసతులు కల్పిస్తూ ఏజ్ ఫ్రెండ్లీ సిటీగా తీర్చిదిద్దాలని కోరారు. ఇంటి నుంచి అడుగు బయటపెట్టింది మొదలు తిరిగి ఇల్లు చేరుకునే వరకు అందరితో పాటే సీనియర్ సిటిజన్లు అవస్థలు పడుతున్నారు. రోడ్డు దాటాలంటే అడుగు ముందుకు పడదు. బస్సు ఎక్కుదామన్నా రద్దీలో సాధ్యం కాదన్నారు. నడిచేందుకు ఫుట్ పాత్‌లు కనిపిం చవన్నారు. అనుక్షణం రయ్యి మంటూ వాహనాలు దూసుకెళ్లే నగరంలో రోడ్డు దాటడ మంటే సాహసమే. నగరంలో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించటం లేదని విమర్శించారు. దవాఖానాల్లో వైద్యం నుంచి మీ సేవల బిల్లుల చెల్లింపుల వరకు అన్ని చోట్ల క్యూలో ఉండాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో వృద్ధులకు ప్రత్యేక లైన్లు ఉన్నా రద్దీ ఎక్కువైతే ఇబ్బందులు తప్పవన్నారు. ప్రయాణంలో బస్సు ఎక్కేందుకు, దిగేందుకు అవస్థలు పడాల్సిందే. వృద్ధులను, మహిళలను గౌరవించాలి అని బస్సుల్లో తాటికాయంత అక్షరాలు రాసిఉన్నా ఆ గౌరవం దక్కటం లేదన్నారు. ముందు నుంచి బస్సు ఎక్కుతున్నా రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు కిందపడే పరిస్థితి. పెద్ద వాళ్ళు వచ్చారని వారికి కేటాయించిన సీట్లు ఇచ్చే వారు కూడా లేరన్నారు. డిమాండ్‌కు సరిపడా రవాణా వ్యవస్థ లేకపోవటంతో బ్యాంకులకు వెళ్లాలన్నా, పబ్లిక్ పార్కులకు వెళ్లాలన్నా, ఆస్పత్రులకు వెళ్లాలన్నా ఆటోలే దిక్కు. ఏజ్ ఫ్రెండ్లీ సిటీ అంటే భద్రతకు భరోసా, ఆరోగ్యానికి అండ, అవస్థలు లేని ప్రయాణం, ఆర్థిక సామాజిక ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించటమే అని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ పేర్కొందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద వీల్ ఛైర్స్ కూడా ఉండాలన్నారు. న్యూయార్క్ లాంటి సిటీలలో ఆ దేశ అధ్యక్షుడు కూడా వృద్ధుల సంఘం పిలిస్తే వారి వద్దకు వస్తారన్నారు. అంతటి గౌరవం అక్కడి వృద్ధులకు ఉంటుందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే రాజధాని ప్రాంతంలో సీనియర్ సిటిజన్స్‌కు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి పెద్దరికాన్ని గౌరవించాలని వీరయ్య కోరారు.






బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దంపతులు, భక్తులు

ఘనంగా శ్రీ విశ్వావసు నామ ఉగాది వేడుకలు

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం

గుంటూరు(తూర్పు), మార్చి 30(ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలకు అద్దం పట్టేలా నగరంలోని ఆలయాల్లో ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకల్ని భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో ఆలయాల్లో దైవ దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాడీపేట, అరండల్‌పేట, గోరంట్ల, పాత గుంటూరుతో పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విశిష్ట సేవలందించిన ప్రముఖులకు, కళాకారులకు పురస్కారాలు అందించి సత్కరించారు.

● స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుల బృందం స్వామి, అమ్మవార్లకు విశేషార్చనలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. విశేషంగా పాల్గొన్న భక్తులకు భాష్యం విద్యా సంస్థలు ఉగాది పచ్చడితో పాటు ప్రత్యేక ప్రసాద వితరణ చేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దంపతులు స్వామి ఆశీస్సులు అందుకున్నారు. అన్నమయ్య కళావేదికపై జరుగుతున్న కవి సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం ప్రముఖ ప్రవచకులు కేవీ కోటేశ్వరరావు పంచాంగ శ్రవణం చేశారు.



కేవీ కోటేశ్వరరావు పంచాంగ శ్రవణం



శ్రీకోదండ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి



గోరంట్ల, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ముత్యాలతో అలంకరణ

● అరండల్‌పేట శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో నిర్వాహకుడు మర్రిపాటి ప్రసాదు ఆధ్వర్యంలో ఉగాదిని పురస్కరించుకొని శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారికి విశేష అభిషేకార్చన చేశారు.

● స్థానిక గోరంట్ల, శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థాన సొసైటీలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. అత్యంత శోభాయమానంగా ముత్యాలతో అలంకరించిన శ్రీవారి దర్శనం ఉదయం ఐదు గంటల నుంచే ప్రారంభమైంది. కార్యక్రమాల్ని ఆలయ కమిటీ ఛైర్మన్ కంచర్ల ఆంజనేయులు పర్యవేక్షించారు.

● స్తంభాలగరువులోని శ్రీకోదండ రామాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. అనేక మంది పుర ప్రముఖులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను అందుకొన్నారు. ప్రముఖ ప్రవచకులు యడ్లవల్లి నరేంద్రశర్మ పంచాగ శ్రవణం చేశారు.



భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



అరండల్‌పేట అష్టలక్ష్మి ఆలయంలో ప్రత్యేక అలంకరణ

నేడు ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ రద్దు

గుంటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం పోలీస్ కార్యాలయంలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. రంజాన్ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఈ కార్యక్రమమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీలు ఇవ్వద లచుకున్న ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని కోరారు. ఆయా స్టేషన్‌లలో ఫిర్యా దులు చేసినా అక్కడ న్యాయం జరగని వారు ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రజలు ఈ విషయం గమనించి గుంటూరులోని ఎస్పీ కార్యాలయానికి రావద్దని సూచించారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత

గుంటూరు(తూర్పు), మార్చి 30(ఆంధ్రజ్యోతి): గుంటూరు మెడికల్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుకుంటున్న బండ్లమూడి వాసవికి కమ్మ జన సేవాసమితి పాలకవర్గ సభ్యుడు ఘంటా పున్నారావు రూ.30వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ చెక్కును ఆదివారం, కుందుల రోడ్డులోని బాలికల వసతి గృహంలో సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు. అనంతరం వసతి గృహంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు వంకాయ ల పాటి బలరామకృష్ణయ్య, వడ్లమూడి నాగేంద్రం, వడ్లమూడి శివరామకృష్ణయ్య, పెద్ది సాంబశివరావు, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, మైనేని సీతారామయ్య తదితరులు పాల్గొని ప్రముఖ ప్రవచనకర్త నోరి నారాయణమూర్తిని సత్కరించారు.



బండ్లమూడి వాసవికి చెక్కును అందజేస్తున్న సామినేని కోటేశ్వరరావు, ఘంటా పున్నారావు

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి

గుంటూరు(తూర్పు), మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా ఈశ్వర వరప్రసాద పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లక్ష్మీపురం, శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో శాస్త్రీయ సంగీత కచేరి ఆలరించింది. ప్రముఖ వాగ్గేయకారుడు మల్లాది శివానంద యశ్వసీ విరిబోణి అరుతాళ వర్ణం, వాతాపి గణపతిం భజే, ఎవరిని నిర్ణయించదరో, మాతంగి శ్రీరాజరాజేశ్వరి రామ ప్రియ, స్వరరాగ సుధారస వంటి త్యాగరాజ కీర్తనలతో ఆలపించారు. వాయులీనంపై మల్లాది సింధు రాగేశ్వరి, మృదంగంపై కామరాజు కార్తికేయ ఆదినారాయణ శర్మ వాద్య సహకారం అందించారు. కార్యక్రమాల్ని పరిషత్తు ట్రస్టీ మోదుగుల రవికృష్ణ పర్యవేక్షించారు.



త్యాగరాజ కీర్తనలకు ఆలపిస్తున్న మల్లాది శివానంద

విద్యార్థులకు ఉచిత పాలిసెట్, ఏపీఆర్జేసీ శిక్షణ

గుంటూరు విద్య మార్చి 30(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు, ఎన్నారై ఇంజ నీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఈనెల 2వ తేదీ నుంచి పాలిసెట్ ఏపీఆర్జేసీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు ఆదివారం తెలిపారు. మేరకు కోచింగ్ బ్రోచర్ ఆదివారం విడుదల చేశారు. కోచింగ్ ప్రతిరోజు ఉదయం 9 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తామని వివరించారు. లక్ష్మీపురం, కొత్తపేటలోని ఎన్నారై విద్యా సంస్థల్లో కోచింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 8885995458, 9502054168లో సంప్రదించాలని సూచించారు. పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమంలో రోట్ రోటరీ అచీవర్స్ అధ్యక్షుడు నల్లూరు సాంబశివరావు, కొండపనేని కార్యదర్శి విజయ్‌కృష్ణ, రోటరీ సభ్యులు జొన్నలగడ్డ రమేష్ పాల్గొన్నారు.



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న తిలక్‌బాబు తదితరులు

నృసింహుడికి గరుడోత్సవం

● అద్దాల మహల్‌లో పవళింపు సేవ

మంగళగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి క్షేత్రంలో శ్రీలక్ష్మీ నృసింహ స్వామి ఆస్థాన అలంకారోత్సవాల ముగింపు సందర్భంగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించు కుని ఆదివారం రాత్రి శ్రీవారికి బంగారు గరుడోత్సవం నిర్వహిం చారు. ఈ ఉత్సవానికి మంగళగిరికి చెందిన నంది కంటి వెంకట హను మాన్ ప్రసాద్ కైంకర్యపరులుగా వ్యవహరించారు. అనంతరం గులాబీలతో సహస్ర నామార్చన, అద్దాల మహల్‌లో పవ ళింపు సేవ చేశారు. ఈ ఉత్సవానికి విజయవాడకు చెందిన కనకవల్లి తాయారమ్మ కైంకర్య పరులుగా వ్యవహరించారు. ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బంగారు గరుడోత్సవంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి

డాక్టర్ రమణకు సీఎం చంద్రబాబు సత్కారం

● కళారత్న అవార్డు ప్రదానం

గుంటూరు కార్పొరేషన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ ఓరుగంటి వెంకట రమణ (ఓవీ రమణ)కు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఘన సత్కారం చేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని డాక్టర్ ఓవీ రమణను కళారత్న (హంస) అవార్డుకి ఎంపిక చేశారు. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ వైద్య, సామాజిక రంగంలో డాక్టర్ రమణ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ రమణ మాట్లాడుతూ తను అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి ఈ అవార్డు అందించడం ఆనందంగా ఉంద న్నారు. డాక్టర్ రమణకు ఈ అవార్డు ఇవ్వడంపై పలువురు హర్షం ప్రకటించారు.



డాక్టర్ ఓవీ రమణకు అవార్డు అందజేసి సత్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

ఏకాదండయ్య పంతులు సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం

● విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగేశ్వరరావు



డాక్టర్ రమణరావు, కమలవల్లి దంపతులను సత్కరిస్తున్న జస్టిస్ ఎస్ఆర్ఎల్ నాగేశ్వరరావు

గుంటూరు(తూర్పు), మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఎనిమిది దశాబ్దాల క్రితం ట్రస్ట్ ఏర్పాటు చేసి విద్య, వైద్యం, ఆధ్యాత్మిక, ఆదరణ గృహాలు ద్వారా సమాజ హిత సేవలందించిన ఏకాదండయ్య పంతులు జీవితం వర్తమాన, భవిష్య తరాలకు ఆదర్శప్రాయమని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఆర్ఎల్ నాగేశ్వరరావు శ్లాఘించారు. శ్రీ ఏకాదండ య్య పంతులు చారిటీస్ ఆధ్వర్యంలో స్థానిక హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీ రింగ్ అండ్ టెక్నాలజీ సుధర్మ సమావేశ మందిరంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఏకాదండయ్య పంతులు సేవలను కొనియాడారు. సభకు ప్రముఖ న్యాయవాది కొండూరి కృష్ణారావు అధ్యక్షత వహించాడు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుడు ఎండీ రమణరావు, కమలవల్లి దంపతులను ఘనంగా సత్కరించి సన్మాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పద్యపఠన పోటీలు

పెదనందిపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక సోమేశ్వరస్వామి కాలక్షేప మండపంలో శ్రీకోదండరామ సంకీర్తన భజనా మండలి, స్పిరిచ్యువల్ సొసైటీ పెదనందిపాడు వారి ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల పౌరాణిక పద్యపఠన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయా రాష్ట్రాల నుంచి 35మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను మాజీ ఎంపీపీ ముద్దన నగరాజకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా సొసైటీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తూ, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు చిలివేరు రామకృష్ణ, మేడూరి సుబ్బారావు, ఉప్పుటూరి భద్రయ్య, వెలినేని కృష్ణారావు పాల్గొన్నారు.

జీపాట్ 2025

గ్రాడ్యుయేట్ ఫార్మసీ అప్టిట్యూడ్ టెస్ట్ (జీపాట్) 2025కి సంబంధించిన నోటిఫికేషన్‌ను 'నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎమ్ఎస్) విడుదల చేసింది. ఎంఫార్మసీ అడ్మిషన్స్ కోసం ఉద్దేశించిన ఈ కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ 2025 మే 25న జరుగుతుంది. 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ విండో ఓపెన్ అవుతుంది. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు natboard.edu.in లింక్ యాక్టివేట్ అయిన తరవాత దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ తరవాత, నాలుగు సంవత్సరాల ఫార్మసీ విద్య పూర్తిచేసుకున్న అభ్యర్థులు దరఖాస్తునకు అర్హులు. అభ్యర్థులకు ఎలాంటి వయో పరిమితి లేదు. మే 21న హాల్ టికెట్లు విడుదల చేస్తారు. మే 25న పరీక్ష కాగా, ఫలితాలను జూన్ 25న వెల్లడించే అవకాశం ఉంది. జీపాట్ అడ్మిషన్ ప్రొసీజర్ ప్రారంభం కంటే ముందే ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంటే బీఫార్మసీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.3500. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.2500. పూర్తి వివరాలకు ఎన్‌బీఈఎమ్ఎస్ వెబ్‌సైట్ చూడవచ్చు.

30 రోజుల్లో నీట్
ఇలా ప్లాన్ చేయండి



నీట్ పరీక్షకు దాదాపుగా ముప్పై రోజుల వ్యవధి ఉంది. ఈ సమయంలో విద్యార్థులకు ప్రణాళికాబద్ధమైన వ్యూహం అవసరం. మొత్తం 180 ప్రశ్నలతో నీట్ యూజీ ఉంటుంది. ఇందులో ఫిజిక్స్ 45, కెమిస్ట్రీ 45, బయాలజీ 90 ఉంటాయనే విషయం తెలిసిందే. ఇందులో సరైన సమాధానానికి 4 నాలుగు మార్కులు లభిస్తాయి. తప్పుగా రాసిన సమాధానానికి ఒక మార్కు మైనస్ చేస్తారు. పరీక్షకు సంబంధించి ఇలా మీదైన సొంత వ్యూహం రూపొందించుకోండి.

- 30 రోజులకు సంబంధించిన షెడ్యూల్‌ను మొదట ప్రిపేర్ చేసుకోండి. మూడు గంటలు ఫిజిక్స్, మూడు గంటలు కెమిస్ట్రీ, మూడు గంటలు బయాలజీకి కేటాయించండి.
- గత పరీక్షల ఆధారంగా అధ్యాయాల వెయిటేజీని విశ్లేషించండి. 2021 నుంచి 2024 వరకు పేపర్ల ట్రెండ్‌ను గమనించండి.
- ఫిజిక్స్, కెమిస్ట్రీ సహా అన్ని సబ్జెక్టుల కాన్సెప్టులను ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల ఆధారంగా నేర్చుకోండి. ప్రతీ చాప్టర్‌కు షార్ట్ నోట్స్ ప్రిపేర్ చేసుకోండి.
- ప్రతీ సబ్జెక్టులోనూ ఎక్కువ వెయిటేజీ ఉన్న చాప్టర్లపై దృష్టి పెట్టండి. అలాగే ప్రతీ విద్యార్థి కొన్ని చాప్టర్లను సులభం అని భావిస్తారు. వాటిపై కూడా తప్పనిసరి దృష్టి సారించాలి.

> సొంతంగా చదువుకునే సమయంలో సందేహం వస్తే టెక్నాలజీపై ఆధారపడండి. అంతేతప్ప సందేహాన్ని తీర్చుకునే విషయంలో వాయిదా అనే మాటే వద్దు. యూట్యూబ్స్, సబ్జెక్ట్ వెబ్‌సైట్స్ ఉపయోగించుకోండి.

- రోజూ ఫిజిక్స్ ఫార్ములాలు రివిజన్ చేయండి. దీనితోపాటు 2021 నుంచి 2024 సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేయండి. రోజుకు ఒక గంట అయినా ఈ పనిచేయాలి.
- ఫిజిక్స్ ప్రాబ్లమ్ సాధించే సమయంలో టైమ్ మేనేజ్‌మెంట్ పాటించండి. ఒక ప్రశ్నను ఒక నిమిషంలో పూర్తి చేసేలా ఉండాలి.
- ఫిజిక్స్‌లో రోజుకు కనీసం 30-40 ప్రశ్నలు పూర్తి చేసేలా చూసుకోండి.
- రోజులో మొదట ఫిజిక్స్ సబ్జెక్టు చదవడానికి ప్రాధాన్యం ఇవ్వండి. ఫ్రెష్ మైండ్‌తో ఎక్కువగా అర్థం అవుతుంది.
- కెమిస్ట్రీ విషయానికి వస్తే ఆర్గానిక్ కెమిస్ట్రీపై పట్టు సాధించండి. మెకానిజమ్స్ ప్రాక్టీస్ చేయండి. ఫ్లోచార్ట్స్ గుర్తుంచుకోండి.
- కెమిస్ట్రీ ఫార్ములా రివిజన్‌తోపాటు 2019 నుంచి 2024 వరకు ప్రశ్న పత్రాలపై పట్టుసాధించాలి.
- ఫిజికల్ కెమిస్ట్రీలలో బలమైన అంశాలపై దృష్టి సారించండి. ఉదాహరణకు ఇన్‌ఆర్గానిక్ కెమిస్ట్రీలో బలహీనంగా ఉంటే పీ-బ్లాక్ ఎలిమెంట్స్‌కో ఆర్డినేట్ కాంపౌండ్స్‌పై ఎక్కువ సమయం కేటాయించండి.
- బయాలజీ విషయానికి వస్తే ఎన్‌సీఆర్‌టీ పుస్తకాలు చదవండి. జన్యుశాస్త్రం, మానవ శరీర నిర్మాణ శాస్త్రం, బయోటెక్నాలజీ, పర్యావరణ శాస్త్రం మొదలైన వాటికి ఎక్కువ వెయిటేజీ ఉంటుంది.
- మెటీరియల్ చదివే సమయంలో రాసుకున్న షార్ట్‌నోట్స్ రివిజన్ సమయంలో బాగా ఉపయోగపడుతుంది. తరుచూ ఎంట్రెన్స్‌లో వచ్చే చాప్టర్లు ఎక్కువగా రివిజన్ చేయడాలి.
- ముఖ్యమైన డయాగ్రామ్ చదవండి. ప్రతీ డయాగ్రామ్ లేబుల్స్ క్షుణ్ణంగా పరిశీలించండి.
- బయాలజీ స్కోరింగ్ సబ్జెక్టు. అందుకే డిటైల్డ్‌గా చదవడానికి ప్రయత్నించండి.
- వీలయినన్ని మాక్ టెస్ట్‌లు రాయండి. దీంతో ఏయే చాప్టర్లపై పట్టు ఉందో అర్థం అవుతుంది. అలాగే టైమ్ మేనేజ్‌మెంట్ టెక్నిక్ తెలుస్తుంది.
- నా ప్రిపరేషన్ సరిగా లేదేమో లేదా సరిపోలేదేమో అనే భావనకు లోనుకావద్దు. ఆత్మవిశ్వాంతో ఉండండి.



- డా. కిషన్ రావు టంకశాల
సంజీవని మెడికల్ అకాడమి

The Cadence Program



The Cadence Scholarship Program 2025-26 provides financial assistance to Indian nationals pursuing undergraduate and professional courses in select regions (Delhi NCR, Bangalore, Pune, Ahmedabad, or Hyderabad).
Eligibility: Must be an Indian national residing and studying in one of the eligible regions. For undergraduate courses, applicants should have passed Class 12 with a minimum overall score of 60% (current Class 12 students may apply based on previous records). Must come from a lower-income group. Preference will be given to STEM students, female students, and eligible specially-abled or transgender candidates.
Prizes & Rewards: Financial support for covering key educational expenses.
Last Date to Apply : 31-05-2025
Application mode : Online applications only
Short Url: www.b4s.in/aj/TCSP5

The Doon School Scholarship

The Doon School Scholarship Examination (DSSE) is an annual entrance exam conducted by the Doon School, Dehradun, Uttarakhand. The scholarship exam is open to male students entering Class 7 or 8, whose families may find it difficult to pay the school fees.
Eligibility: This is open to Indian male students. Applicants must be between 11 to 13 years old as of 30th September 2025. Students must be promoted to Class 7 or 8 in the upcoming academic year.
Prizes & Rewards : An opportunity to pursue studies at the Doon School with financial assistance in the form of scholarship.
Last Date to Apply : 15-04-2025
Application mode: Online and offline via email at (admissions@doonschool.com)
Short Url: www.b4s.in/aj/DSSE2

buddy4study.com

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్స్

జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే మేనేజ్‌మెంట్ కోర్సులు చేయాలనే భావం స్థిరపడి పోయింది. సైన్స్, ఆర్ట్స్, కామర్స్ ఇలా ఏ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చిన వారికైనా మేనేజ్‌మెంట్ కోర్సులు చేసే అవకాశం ఉంది. అలాగే ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటున్నవారు కూడా ఈ కోర్సులు చేసి కెరీర్‌లో మరింత ముందుకు వెళ్లగలుగుతున్నారు. కొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థల మేనేజ్‌మెంట్ కోర్సుల నోటిఫికేషన్ వెలువడింది. ఒకసారి పరిశీలించండి.

ఐపీఈ హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ 2025-27 విద్యా సంవత్సరానికి పీజీడీఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆసక్తి గల అభ్యర్థులు 2025 మార్చి 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు https://www.ipeindia.org/ వెబ్‌సైట్ చూడవచ్చు.

ప్రోగ్రామ్‌లు

పీజీడీఎం - పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్
పీజీడీఎం - మార్కెటింగ్ మేనేజ్‌మెంట్



పీజీడీఎం - బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
పీజీడీఎం - ఇంటర్నేషనల్ బిజినెస్
పీజీడీఎం - హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్
పీజీడీఎం - బిజినెస్ అనాలిసిస్
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ, క్యాట్/గ్జాట్/జీమ్యాట్/ మ్యాట్/ సీమ్యాట్/ ఏటీఎంఏ టెస్ట్ స్కోరు ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ
ఇంటర్వ్యూ తేదీ: 2025 ఏప్రిల్ 12

'నిట్' కురుక్షేత్ర

హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 2025-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు 2025 మే 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు https://nitkkr.ac.in వెబ్‌సైట్ చూడవచ్చు.
అర్హత: గ్రాడ్యుయేషన్‌తోపాటు, క్యాట్/ సీమ్యాట్/ మ్యాట్ స్కోరు ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది.
చివరి తేదీ: 2025 మే 5
గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తేదీ ప్రకటన: 2025 మే 8

ఐఐఎం బోథ్‌గయ

ఐఐఎం బోద్‌గయ, టీంలీజ్ ఎడ్యుటెక్‌తో కలిసి ఆన్‌లైన్ 'ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఈఎంబీఏ)ని డిజైన్ చేసింది. ఈ రెండు సంవత్సరాల ఆన్‌లైన్ కోర్సు మధ్య స్థాయి నుంచి సీనియర్ స్థాయిలో ఉన్న ఎగ్జిక్యూటివ్‌లకు ఉపయోగపడుతుంది. ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్, స్ట్రాటజీ తదితర సబ్జెక్టులు ఇందులో ఉంటాయి. వివరాల కోసం https://iimb-gonline.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

JOBS

ఇండియన్ నేవీలో అగ్నివీర్

భారత నౌకాదళంలో అగ్నివీర్ ఖాళీల నియమకానికి నోటిఫికేషన్ వెలువడింది. ఎంపికైన వారికి 'ఐఎన్ఎస్ చిల్కా'లో శిక్షణ ఉంటుంది. 2025, 2026 బ్యాచ్‌లకు సంబంధించిన నోటిఫికేషన్ ఇది.
ప్రకటన పేరు: అగ్నివీర్(మెట్రిక్ రిక్రూట్-ఎంఆర్) ఖాళీలు
అర్హత: పదో తరగతి పాసైన అవివాహిత స్త్రీ, పురుష అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
వయస్సు: 02/2025 బ్యాచ్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2004 సెప్టెంబరు 1 నుంచి 2008 ఫిబ్రవరి 29 మధ్యలో జన్మించి ఉండాలి. 01/2026 బ్యాచ్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2005 ఫిబ్రవరి 1 నుంచి 2008 జూలై 31 లోపు జన్మించి ఉండాలి. 02/2026 బ్యాంక్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2005 సెప్టెంబరు 1 నుంచి 2008 డిసెంబర్ 31లోపు జన్మించి ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: నేవీ ఎంట్రెన్స్ ద్వారా షార్ట్ లిస్ట్ చేస్తారు. రాత పరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష, వైద్య పరీక్ష ఉంటాయి.
పరీక్ష: ప్రశ్నపత్రం హిందీ/ఇంగ్లీష్ భాషల్లో ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 50 మల్టిపుల్ ఆన్సర్ ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లీష్, సైన్స్, మేథ్స్, జనరల్ అవేర్‌నెస్ నాలుగు విభాగాలు పదో తరగతి స్థాయిలో ఉంటాయి.
దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఏప్రిల్ 10
ఎంట్రెన్స్ టెస్ట్: 2025 మే 25న
వెబ్‌సైట్ : https://www.joinindiannavy.gov.in/

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

మంగళగిరి సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా అన్నారు. శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ గృహ కల్ప రోడ్డులో హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్ద, పాత మార్కెట్ సెంటర్లో గాంధీ విగ్రహం వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. కమిషనర్ అలీం బాషా చలివేంద్రాన్ని ప్రారంభించి ట్రస్టు ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ వాకా మంగారావు, ప్రధాన కార్యదర్శి డోకిపర్తి శ్రీనివాసరావు, సభ్యులు తోట గౌరీ శంకర్, గొర్రె సత్యనారాయణ, గోలి గురు చంద్రరావు, మునగాల దుర్గారావు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి గరుడోత్సవం

● అద్దాల మహల్‌లో పవళింపు సేవ



బంగారు గరుడోత్సవంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి

మంగళగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి క్షేత్రంలో శ్రీలక్ష్మీ నృసింహ స్వామి ఆస్థాన అలంకారోత్సవాల ముగింపు సందర్భంగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి శ్రీవారికి బంగారు గరుడోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి మంగళగిరికి చెందిన నంది కంటి వెంకట హనుమాన్ ప్రసాద్ కైంకర్యపరులుగా వ్యవహరించారు. అనంతరం గులాబీలతో సహస్ర నామార్చన, అద్దాల మహల్‌లో పవళింపు సేవ చేశారు. ఈ ఉత్సవానికి విజయవాడకు చెందిన కనకవల్లి తాయారమ్మ కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాటర్ ప్యూరిఫైయర్ అందజేత

పెదనందిపాడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నాగులపాడు శ్రీవల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానానికి దాత వాటర్ ప్యూరిఫైయర్‌ను శనివారం అందజేశారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు బ్యాంక్ ఆఫ్ బరోడా పెదనందిపాడులో అసిస్టెంట్ మేనేజర్ మణికంఠకార్తీక్, ఇందిరా ప్రియదర్శిని దంపతులు కమిటీ సభ్యులకు అందజేశారు.అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి, దాతలకు ఆశీర్వచనాలు అందజేశారు. దాతలను కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ గొల్లపూడి సాంబశివరావు, పాటిబండ్ల సుబ్బారావు, కన్నెగంటి చలమయ్య ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లంక శివరామ్‌ప్రసాద్

మంగళగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి బార్ అసోసియేషన్‌కు శనివారం జరిగిన ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది లంక శివరామ్ ప్రసాద్ ఘన విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా ప్రత్తిపాటి నవజీవన్, జనరల్ సెక్రటరీగా కురగంటి రమేష్, జాయింట్ సెక్రటరీగా సూరబోయిన మురళీకృష్ణ, లేడీ సెక్రటరీగా సింగంశెట్టి ఇందిరా ప్రియదర్శిని విజయం సాధించారు. లైబ్రరీ సెక్రటరీలుగా ఈమని అశోక్‌రెడ్డి, గుర్రం రామారావులు, మరో 19మంది ఈసీ మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన లంక ప్రసాద్‌ను బార్ అసోసియేషన్ న్యాయవాదులు సత్కరించారు.

ముగిసిన పద్యపఠన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పెదనందిపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక సోమేశ్వరస్వామి కాలక్షేప మండపంలో శ్రీకోదండరామా సంకీర్తన భజనా మండలి, స్పిరిచ్యువల్ సొసైటీ పెదనందిపాడు వారి ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల పౌరాణిక పద్య పఠన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయా రాష్ట్రాల నుంచి 35మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను మాజీ ఎంపీపీ ముద్దన నగరాజకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళలు అంతరించిపోతున్న వేళ ఏడు సంవత్సరాలుగా సొసైటీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తూ, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు చిలివేరు రామకృష్ణ, మేడూరి సుబ్బారావు, ఉప్పుటూరి భద్రయ్య, వెలినేని కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాబాను దర్శించుకున్న అద్వైతానంద స్వామి

మంగళగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గంగోత్రి నుంచి విచ్చేసిన అద్వైతానందగిరి స్వామీజీ ఆదివారం మంగళగిరి మండలం పెదవడ్లపూడిలోని భగవాన్ శ్రీసత్య షిరిడీ సాయిబాబా మందిరాన్ని దర్శించారు. తొలుత ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం, అర్చకులు స్వామీజీకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అద్వైతానందగిరి స్వామీజీ బాబాకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయోధ్య రామాలయానికి పంపించనున్న రామబాణానికి ప్రత్యేక పూజలు చేశారు. గోశాలను సందర్శించి గోవులకు ఆహారం అందజేశారు.

● రంజాన్ పండుగ సందర్భంగా తాడికొండ మండలం మోతడక గ్రామంలోని ముస్లింలకు బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు మంచికలపూడి గంగాధర్‌రావు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. **(తాడికొండ,ఆంధ్రజ్యోతి)**

కంతేరులో పడకేసిన పారిశుధ్యం

● ప్రధాన కాల్వలో పెరిగిన పిచ్చి మొక్కలు
● రోడ్లపైకి వస్తున్న మురుగునీరు
● పట్టించుకోని స్థానిక అధికారులు



కంతేరు ప్రధాన రహదారిలోని సైడ్ కాల్వలో పెరిగిన పిచ్చిమొక్కలు



ఎస్సీ కాలనీల్లో రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

తాడికొండ(కంతేరు), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. కంతేరు గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కంతేరు - నిడమర్రు రహదారిలోని ప్రధాన కాల్వల్లో పిచ్చి మొక్కలు పెరిగి మురుగునీటి పారుదలకు ఆటంకంగా ఉన్నాయి. పంచాయతీ అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. ఎస్సీ కాలనీల్లో ఇదే పరిస్థితి ఉంది. మురుగు కాల్వలు సక్రమంగా తీయకపోవటం వల్ల మురుగునీరు రోడ్డుపై పారుతుంది. పారిశుధ్యంపై సరియైన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. స్వచ్ఛాంధ్ర పేరుకే గానీ పాటించిన దాఖలాలు కన్పించటంలేదు. సంపద తయారీ కేంద్రంలో తడి, పొడి చెత్తను వేరు చేయటం అనేది కలగానే మిలిగింది. సంపద తయారీ కేంద్రానికి తాళాలు పడ్డాయి. మురుగు నీరు పారుదలకు సరైన కాలువలు లేవు. ఉన్నా వాటిలోని మురుగును తొలగించటం లేదు. పారిశుధ్యం సక్రమంగా లేకపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో వైరల్ జ్వరాలు, డెంగీ, చికెన్‌గున్యా వ్యాధులు ప్రబలుతున్నాయి. అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించటంలో అధికారులు, పాలకులు విఫలమౌతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఘనంగా తెలుగు సంవత్సరాది వేడుకలు



నృసింహాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న శేషాంజనేయ గోపాల్



వట్టిచెరుకూరులో పంచాంగ శ్రవణం చేస్తున్న వేద పండితుడు తిరుమాలాచార్యుడు, పాల్గొన్న గ్రామస్థులు

మంగళగిరి సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాదికి మంగళగిరి ప్రజలు ఘనస్వాగతం పలికారు. తెలుగు సంవత్సరాది వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మంగళగిరి పట్టణం, మండలంలోని అన్ని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మెట్ల మార్గంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. నృసింహాలయంలో ఎగువ, దిగువ సన్నిధుల్లో నృసింహస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. తొలుత ఉదయం ఉగాది తిరువంజనోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి నరసాపురంనకు చెందిన కర్రా తాయారమ్మ, మంగళగిరికి చెందిన దేవతి రంజిత్ కుమార్ కైంకర్యపరులుగా వ్యవహరించారు. అనంతరం శాంతి కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీకృష్ణదేవరాయ ముఖమండపంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా శనగల శేషాంజనేయ గోపాల్ పంచాంగ శ్రవణం చేశారు. నృసింహాలయ ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. దామర్ల నాంచారమ్మ ప్రాంగణంలోని శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి దేవస్థానంలో సిద్ధాంతి అరికాటి రమేష్ ఉగాది పంచాగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలీయ సంఘం ఉపాధ్యక్షుడు గుత్తికొండ ధనుంజయరావు, ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ ఆలయంలో పంచాంగ శ్రవణం

తాడేపల్లి టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణపరిధిలోని సీతానగరం శ్రీమద్విరాంజనేయ స్వామి దేవాలయంలో ఉగాది సందర్భంగా ఆదివారం రాత్రి పంచాంగ శ్రవణం నిర్వహించారు. వేదాంతం వేణుగోపాలాచార్యులు పంచాంగకర్తగా వ్యవహరించారు. దుర్గగుడి ఈవో రామచంద్ర మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు మారుతీ ఆచార్యులు, శ్రీనివాసాచార్యులు, సుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.



మోతడక కాకతీయ కన్వెన్షన్‌లో ఉగాది వేడుకల్లో పాల్గొన్న సభ్యులు

● **దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి):** ఉగాది సందర్భంగా పలుగ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కళకళలా డాయి. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు. కేఆర్ కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయంలో అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ, శివాలయంలో అర్చకుడు యుగంధర్‌శర్మలు పంచాంగశ్రవణం నిర్వహించారు.

● **పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆయా గ్రామాల్లో ఉగాది వేడుకలు ఆదివారం ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడిని భక్తులకు అందజేశారు.

● **తాడికొండ (మోతడక), (ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని మోతడక గ్రామంలోని కాకతీయ కన్వెన్షన్ సొసైటీలో ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. పంచాంగాన్ని చదివి వినిపించారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని రుచి చూశారు. కార్యక్రమంలో కన్వెన్షన్ సభ్యులు డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, కంచేటి కరుణాకర్, శంకర్రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● పొన్నెకల్లులోని శ్రీముప్పాళ్ల చిన్న కృష్ణ అవధూత ఆధ్యాత్మిక ధ్యాన మందిరంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పచ్చల సాంబశివరావు, ముప్పాళ్ల శివశంకరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● **వట్టిచెరుకూరు (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గ్రామాల్లో తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని ఇంటింట పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో పూజారులు తెల్లవారుజామునే స్వామికి అలంకారాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేస్తూ తీర్థ ప్రసాదాలు అందజేశారు. వట్టిచెరుకూరులోని వేణుగోపాల స్వామి ఆలయంలో వేద పండితుడు తిరుమలాచార్యులు పంచాంగం శ్రవణం చేశారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజయ్యారు.

రంజాన్‌కు మసీదుల ముస్తాబు



విద్యుద్దీపాలంకరణలో మంగళగిరి జామియా మసీదు



దుగ్గిరాలలో విద్యుద్దీపాలంకరణతో ముస్తాబైన మసీదు

మంగళగిరి సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో ఆదివారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో సోమవారం రంజాన్ పండుగ జరుపుకునేందుకు ముస్లింలు సమయాత్తమయ్యారు. రంజాన్ పర్వదినం సూచీగా ఆదివారం సాయంత్రం పాతబస్టాండు సెంటరులోని జామియా మసీదులో సైరన్ మోగించారు. పవిత్ర రంజాన్ సందర్భంగా సోమవారం ఉదయం అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి. ఉదయం 9:30 గంటలకు పాతబస్టాండు వద్ద జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి. అనంతరం పది గంటలకు ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించేందుకు అంజుమన్ సంస్థ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ ఏర్పాట్లను వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ అక్రం, అంజుమన్ అధ్యక్షుడు షేక్ అల్తాఫ్, ట్రస్టుబోర్డు సభ్యులు పర్యవేక్షించారు. కాగా, రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు.

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మసీదులు రంజాన్ వేడుకలకు ముస్తాబయ్యాయి. విద్యుద్దీప కాంతులతో వెలుగొందుతున్నాయి. చిలువూరు, దుగ్గిరాల, తుమ్మపూడి, పెనుమూలి, రేవేంద్రపాడు తదితర గ్రామాల్లో ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

పెదనంపాడు, (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా మండలంలోని ఆయా మసీదులను ముస్తాబు చేశారు. సోమవారం రంజాన్ వేడుకల్లో భాగంగా ప్రార్థనలు చేసేందుకు మత పెద్దలు ఆయా మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా విద్యుద్దీపాలతో మసీదులను అలంకరించారు.


పాఠశాల అభివృద్ధే లక్ష్యం

జడ్పీహెచ్ఎస్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శివనాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న శివనాగేశ్వరరావు

పెదనందిపాడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించి అభివృద్ధి చేస్తామని ఏపీఎస్ఏ జడ్పీహెచ్ఎస్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తేళ్ల శివనాగేశ్వరరావు అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలో ఆదివారం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వపు విద్యార్థులు సహాయ సహకారాలు అందించాలని. గ్రామంలో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలలో ప్రభుత్వంతో పాటు పూర్వపు విద్యార్థుల సహకారంతో కల్పిస్తున్న సదుపాయాలను తెలియజేసి విద్యార్థులను పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. సైకిల్ స్టాండ్, ప్రహరీ నిర్మాణం, శిథిలావస్థలో తరగతి గదుల పైకప్పులకు మరమ్మతులు చేయడం వంటి అంశాలపై తీర్మానం చేశారు. రాష్ట్రంలో రోబోటిక్ తరగతులు నిర్వహించేందుకు రెండో పాఠశాలగా ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి గుంటుపల్లి అప్పారావు, సభ్యులు రావి శివరామకృష్ణయ్య, ఆళ్ల వెంకట సుబ్బారావు, తోటకూర శ్రీనివాసరావు, షేక్ సలీం, గేరా మోహనరావు, వంకాయల విద్యాసాగర్‌గుప్తా, కొల్లా సీతారామయ్య, మక్కెన జవహర్‌రాణి తదితరులు పాల్గొన్నారు.



● తాడికొండలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వర రావు, టీడీపీ నాయకులు. ముస్లింలకు ఖర్జురాలు, అరటికాయలు పంపిణీ చేశారు. **(తాడికొండ)**



మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన జవ్వాది కిరణ్‌చంద్‌ను న్యాయవాది పొట్లూరి శరత్‌చంద్ర ప్రసాద్, బాణాల రామారావు, శంకర్ రెడ్డి, పల్లబోతుల శివన్నారాయణ, జంజనం వెంకట సాంబశివరావు ఆదివారం కలిసి అభినందనలు తెలియజేశారు. **-మంగళగిరి**

స్మార్ట్ మీటర్లు వద్దంటూ పోస్టర్ల ఆవిష్కరణ

తాడేపల్లి (ఉండవల్లి), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు.. కరెంటు చార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రచురించిన డోరు పోస్టర్లను ఉండవల్లి సీపీఎం కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15485 కోట్లు పెంచి విద్యుత్ వినియోగదారులపై భారం మోపారన్నారు. పెరిగిన చార్జీలు కట్టలేక అల్లాడుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో మరో కొత్త భారాన్ని వినియోగదారులపై మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఇప్పటికే అధునాతనమైన ఐఏఆర్‌టీపీ మీటర్లను డబ్బులు చెల్లించి ఏర్పాటు చేసుకున్నారని, వాటిని తొలగించి స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు కొనుక్కోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

పేదలకు నూతన వస్త్రాల బహూకరణ



పేదలకు నూతనవస్త్రాలు బహూకరించిన చిల్లపల్లి, కాలేషా

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో టీడీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ కాలేషా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఇఫ్తార్‌లో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ఈ నెల మన జీవితంలో శాంతి, ధైర్యం, సమాజానికి సేవ చేసే శక్తి పంచాలని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలేషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేషా, చిల్లపల్లి పేద ముస్లింలకు నూతనవస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగుల్‌మీరా, దండమూడి శైలజారాణి, ఏపీఎస్‌పీ కమాండెంట్ కె.నగేష్‌బాబు, అడిషనల్ కమాండెంట్ ఆశీర్వాదం, జనసేన యువనేత చిట్టెం అవినాష్, గుండా మధు పాల్గొన్నారు.

చరిత్రకారుడు సయ్యద్ నసీర్‌కు ఉగాది పురస్కారం



సీఎం చంద్రబాబు నుంచి కళారత్న అవార్డు అందుకుంటున్న నసీర్ అహ్మద్

తాడేపల్లి(ఉండవల్లి), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లికి చెందిన ప్రముఖ చరిత్రకారులు బహుగ్రంథ రచయిత సయ్యద్ నసీర్ అహ్మద్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఉగాది సంబరాల్లో భాగంగా కళారత్న అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నసీర్ అహ్మద్ తన సరికొత్త పుస్తకం 'భారత స్వాతంత్రోద్యమం.. ఆంధ్రా ముస్లిం యోధులు'ను ముఖ్యమంత్రికి అందజేసి పాతికేళ్ళుగా తాను సాగిస్తున్న స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పుస్తకాల రచన, ప్రచురణ ప్రచార కార్యక్రమాల గురించి వివరించారు. ఈ విశేషాలను సావధానంగా విన్న సీఎం చంద్రబాబు నసీర్‌ను అభినందించారు.

రచయిత బాలబంధు అలపర్తికి కళారత్న పురస్కారం



సీఎం నుంచి కళారత్న అందుకుంటున్న వెంకటసుబ్బారావు

దుగ్గిరాల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలకు చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త, అలపర్తి వెంకటసుబ్బారావు ముఖ్యమంత్రి నుంచి కళారత్న పురస్కారం అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన ఉగాది సంబరాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అలపర్తిని దుశ్శాలువాతో సత్కరించి, కళారత్న జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందించారు. గతంలో బాలబంధు, జాతీయ సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న అలపర్తికి, బాలసాహిత్యం ద్వారా సాహితీ రంగానికి 60ఏళ్లుగా విశిష్ట సేవలను అందించినందుకుగానూ, రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం అందించడంపై ప్రొఫెసర్ బొల్లు లలితానంద, జంపాల మురళి, వెంకట్రావు తదితరులు అభినందించారు.

కొల్లా వీరయ్య చౌదరికి ఉగాది పురస్కారం



సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరిని సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు

కాకుమాను, మార్చి, 30(ఆంధ్రజ్యోతి): ఉగాది వేడుకల్లో భాగంగా గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది సేవా పురస్కారాలకు మండలపరిధిలోని అప్పాపురం గ్రామానికి చెందిన సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవి, నసీర్ అహ్మద్‌ల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం ఆయనను సత్కరించారు. పురస్కారం అందుకోవడంపై గ్రామస్థులు, మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

తాడేపల్లి (ఉండవల్లి), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం సాయంత్రం ఉండవల్లి అంబేద్కర్‌నగర్ ఏఈఎస్‌సీ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఉండవల్లి అంబేద్కర్ నగర్ నుంచి ఉండవల్లి సెంటర్ కూడలి వరకు క్రైస్తవ సంఘాలు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతితో క్రైస్తవులు ఆందోళనలో ఉన్నారని, మత సామరస్యం కోసం అందరం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉండవల్లి లూథరన్ చర్చి పాస్టర్ విజయరావు, పాస్టర్ క్రాంతి కుమార్, రాయపూడి కిరణ్, దొప్పలపూడి జ్యోతిబసు, లాజర్, జగన్‌మోహన్ రావు, శేషయ్య, గోవర్ధన్‌రెడ్డి, శివనాగేశ్వరరావు, సంఘపెద్దలు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ హంతకులను అరెస్టు చేయాలి

తాడికొండ, మార్చి 30:(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ మత బోధకుడు ప్రవీణ్ హత్యను నిరసిస్తూ తాడికొండ అడ్డరోడ్డులో ఆదివారం క్రైస్తవ సంఘాలు మానవహారం నిర్వహించారు. ప్రవీణ్ హత్య చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులపై జరుగుతున్న మతోన్మాద దాడులను ఖండించారు. దోషులను శిక్షించాలని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్ మురికిపూడి ఏసుదాసు, శృంగారపాటి బాబురావు, సంకురు రాజు, నూతక్కి రాము, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ



ముస్లింలకు తోఫాను అందజేస్తున్న తిక్కిరెడ్డిపాలెం సర్పంచ్ మాకినేని జగన్

ప్రత్తిపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని తిక్కిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న ముస్లిం కుటుంబాలకు గ్రామ సర్పంచ్ మాకినేని జగన్ రంజాన్ తోఫా పంపిణీ చేశారు. తన సొంత ఖర్చుతో 545 రూపాయలు విలువ చేసే ఏడు రకాల వస్తువులను కుటుంబాల వారికి అందజేశారు. ఈ సందర్భంగా మాకినేని జగన్ మాట్లాడుతూ రంజాన్ పండుగను ప్రతి కుటుంబం ఆనందంతో జరుపుకోవాలనే ఉద్దేశంతో తాను ఈ తోఫాను అందజేశానన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దక్కుమళ్ల భాగ్యారావు, వార్డు మెంబర్లు మర్రి శ్రీనివాసరావు, రావూరి పరమేశ్వరరావు, సదాశివరావు, శివకుమారి, గ్రామ పెద్దలు మర్రి కిషోర్, మాకినేని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ పండుగ సందర్భంగా వట్టిచెరుకూరులో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఉప్పుటూరి చినరాములు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని రహదారుల నిర్మాణానికి రూ.9.9కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళి పాళ్ల నరేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. పెదకాకాని నుంచి రెడ్డిపాలెం మీదుగా వెనిగండ్ల వెళ్లే రహదారికి రూ.3.50కోట్లు, గుంటూరు చీరాల రాష్ట్ర హైవేకు రూ.2కోట్లు, తెనాలి-నారాకోడూరు రహదారి అభివృద్ధికి రూ.4కోట్లు, గుంటూరు చీరాల రహదారి మరమ్మతులకు రూ.40 లక్షలు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తెలిపారు. రానున్న రోజులలో మిగిలిన రహదారుల నిర్మాణాన్ని కూడా పూర్తిచేయనున్నట్లు వెల్లడించారు.

తెలుగువారి సంస్కృతి సంప్రదాయాల పండుగ ఉగాది

● పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఆలపాటి



ప్రసంగిస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్



కొల్లిపర శివాలయంలో పంచాంగాన్ని పఠిస్తున్న పండితులు పిచ్చియ్యశర్మ

తెనాలిరూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా జరుపుకునే పండుగ ఉగాది అని, బ్రాహ్మణ పండితులతో కలిసి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం విశ్వావసునామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీవిద్యాశంకర భారతీ నృసింహ సదనంలో సూర్యనారాయణ (సూరిబాబు) పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ రాంపల్లి సుబ్రహ్మణ్యప్రసాద్ పంచాంగ పఠనంను ఆలకించి ప్రసాదం స్వీకరించి వేద ఆశీస్సులు తీసుకున్నారు. సుబ్రహ్మణ్యం, ఆమంచి రాంబాబు, బి.కామేశ్వరరావు, ఆంజనేయులు, శివకుమార్, రఘుసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామాల్లో ఉగాది వేడుకలు

తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీవిశ్వా వసు నామ సంవత్సర ఉగాది వేడుకలను పట్టణ ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పలు ఆలయాలను పూలతో అలంకరించారు. కొత్త సంవత్సరంలో అందరికి మంచి జరగాలని కోరుతూ ఆలయ కమిటీలు పూజలు జరిపాయి. భక్తులు ఆలయాలను దర్శించి పూజల్లో పాల్గొన్నారు. పలు చోట్ల పంచాంగ శ్రవణాలను భక్తులు శ్రద్ధగా ఆలకించారు. పినపాడు తెలుగు సాహితీ సౌరభం కార్యక్రమాన్ని సిద్ధాంతి మోదుకూరి రాధాకృష్ణశర్మ నిర్వహించారు. పంచాంగ శ్రవణం చేశారు. వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

కొల్లిపర మండలంలో...

కొల్లిపర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని దేవాలయాల్లో పండితులు వివిధ అభిషేకాలతో పాటు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండల కేంద్రం కొల్లిపర శ్రీగంగా పార్వతీ సమేత శ్రీముక్తేశ్వరస్వామి దేవాలయంలో, శ్రీజనార్దనస్వామి ఆలయం, శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో పండితులు పిచ్చియ్యశర్మ, జగన్నాథాచార్యులు, కుమారస్వామి, నిరంజన్‌కుమార్ శర్మలు వివిధ అభిషేకాలు నిర్వహించి వచ్చిన భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. గంగా పార్వతీ సమేత శ్రీముక్తేశ్వరస్వామి ఆలయంలో పండితులు పంచాంగాన్ని చదివి వినిపించారు. కొల్లిపర మండల బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పండితులు పరాశరం జగన్నాథాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మ, పోతరాజు రాంబాబు, కల్వకొల్లు వీరభద్రరావు, సూర్యనారాయణ శాస్త్రి, కొల్లిపర కుటుంబరావు, గాదిరాజు ఉదయ భాస్కర్, కొల్లిపర నిరంజన్, కొల్లిపర సాయి కుమార్, పెనుమర్తి వెంకటరమణశర్మలు శ్రీవిశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని విడుదల చేశారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు ఉచితంగా పంచాంగం పుస్తకాలను పంపిణీ చేశారు. రైతులు, వ్యాపారవేత్తలు అధికసంఖ్యలోతరలివచ్చారు.

పొన్నూరులో..

పొన్నూరు టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరం విశ్వావసు ఉగాది పండుగను పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని గృహాలలో, ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణ శివారులోని శ్రీ సిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఉగాది వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సిద్ధి వినాయకుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించి విఘ్నేశ్వరుడికి ప్రీతికరమైన గరిక, ఉండ్రాళ్లు, తదితర నైవేద్యాలు సమర్పించారు. అలాగే పట్టణంలోని వీరాంజనేయస్వామి, సహస్ర లింగేశ్వరస్వామి, వాసవి కన్యక పరమేశ్వరి, తెలగపాలెం కోదండరామాలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. చేబ్రోలు మండలంలోని నాగేశ్వరస్వామి దేవాలయం, శలపాడు వేణుగోపాల స్వామి ఆలయాలలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని భక్తులకు పంచి పెట్టారు. సాయంత్రం ఆలయాలలో పంచాంగ శ్రవణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాలలో పలువురు పంచాంగకర్తలు పాల్గొని పంచాంగ ఫలితాలను, ఆదాయ, వ్యయాలను వివరించారు.

పెదకాకాని శివాలయంలో...

పెదకాకాని, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శివాలయములో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర తెలుగు సంవత్సరాది పురస్కరించుకొని దేవాలయంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారికి అర్చకస్వాములు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంను ప్రత్యేకంగా అలంకరించారు. పంచాంగ శ్రవణం అనంతరం, పంచాంగం, ప్రసాదం పంపిణీ చేసినట్లు ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. కమిషనరు దేవదాయశాఖ ఆదేశాల ప్రకారం ఇద్దరు అర్చకస్వాములకు, ఒక వేదపండితులకు ఒక్కొక్కరికి రూ.10,116/-లు నగదు, శ్రీస్వామి వారి శేష వస్త్రం, ఫలములు, శ్రీస్వామివారి చిత్రపటంతో ఘనంగా ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ సత్కరించారు. పురస్కారాలు అందుకున్నవారిలో తెనాలికి చెందిన విఘ్నభట్ల సత్యనారాయణ ఘనాపాటి, పెదకాకాని వేణుగోపాలస్వామి వారి దేవస్థాన ప్రధాన అర్చకస్వామి వేదాంతం లక్ష్మీనరసింహాచార్యులు, దుగ్గిరాల మండలం మోరంపూడి శివాలయ అర్చకస్వామి కొలకలూరి వెంకట మారుతీ ప్రసాదు ఉన్నారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకస్వామి పొత్తూరి లక్ష్మీనారాయణవరప్రసాదు, ఉపప్రధాన అర్చకస్వాములు పేటేటి ధనమహేశ్వరప్రసాదు, అర్చకస్వాములు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నట్లు ఆలయ ఉపకమిషనరు తెలిపారు.

విద్యార్థులు తెలుగు భాషపై శ్రద్ధ చూపాలి

● తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తెలుగు భాషపై శ్రద్ధ చూపాలని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎంవీఎన్ శ్రీనివాసరావు కోరారు. బోసురోడ్డులోని శ్రీవాసవి ఆలయంలో 5, 6 తరగతులు చదివే విద్యార్థులకు ఆదివారం ఉగాదిని పురస్కరించుకుని పోటీ నిర్వహించారు. తెలుగుభాష పరిజ్ఞానాన్ని పరిక్షించారు. విజేతలకు రూ.7వేలు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాల కోసం ఆంగ్ల భాషను నేర్చుకుంటున్నప్పటికీ మాతృభాషను మరిచిపోకూడదన్నారు. కార్యక్రమంలో పద్మజ, లక్ష్మీనారాయణ, కల్యాణి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో ర్యాలీ

పొన్నూరు టౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నూతన తెలుగు సంవత్సరం విశ్వావసు నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో బ్రహ్మకుమారీలు ర్యాలీ నిర్వహించారు. నేతాజీ నగర్‌నుంచి ఐలాండ్ సెంటర్ మీదుగా ర్యాలీ జరిగింది. జెండాలు చేతబూని శివలింగాలను చేతబూనిన బ్రహ్మకుమారీలు ర్యాలీల్లో పాల్గొని ఉగాది పండుగ గొప్పదనాన్ని తెలియజెప్పారు. కార్యక్రమంలో తెనాలికి చెందిన బెహన్ తులసి, శివపార్వతి, రాజేశ్వరి, లక్ష్మీకోటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాసరావు, పద్మజ

శిల్పి కాటూరికి రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం



ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న శిల్పి కాటూరి

తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన ప్రముఖ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావుకు ఉగాది పురస్కారం లభించింది. విజయవాడలో జరిగిన ఉగాది పురస్కారాల సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కళారత్న పురస్కారం అందుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా శిల్ప కళాశాలలో ఆయన చేస్తున్న కృషి గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారానికి ఎంపిక చేసింది. అవార్డు అందుకున్న ఆయనను పలువురు శిల్పులు, సాహిత్యవేత్తలు, కళాకారులు అభినందించారు.

రఘు కిశోర్ శర్మకు..



ఉగాది పురస్కారం అందుకుంటున్న రఘు కిశోర్ శర్మ

పొన్నూరు టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సహస్ర లింగేశ్వరస్వామి ఆలయ అర్చకుడు పొన్నూరు రఘు కిశోర్‌శర్మకు ఆదివారం ఉగాది పురస్కారం అందుకున్నారు. దేవదాయశాఖ, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన పురస్కారాలలో ఎమ్మెల్యే బీ సీతారామాంజనేయులు, షేక్ నజీర్ అహ్మద్, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు, ఆలయ ఈవో గద్దే అమర్‌నాథ్‌ల నుంచి ఈ పురస్కారాన్ని రఘుకిశోర్ శర్మ అందుకున్నారు.

కృష్ణేశ్వరరావుకు...

పొన్నూరు టౌన్ మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన ప్రముఖ సినీ నటుడు వైఎస్ కృష్ణేశ్వరరావుకు రాష్ట్ర ప్రభుత్వం కళారత్న అవార్డు ప్రదానం చేసింది. ఉగాది పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇచ్చే ఈ అవార్డును పొన్నూరు పట్టణానికి చెందిన కృష్ణేశ్వరరావుకు ప్రదానం చేశారు. పలు చిత్రాలతో పాటు నాటక రంగంలోనూ దశాబ్దాలుగా కృష్ణేశ్వరరావు విలక్షణ నటుడుగా రాణిస్తున్నారు. కృష్ణేశ్వరరావుకు కళారత్న అవార్డు రావడంపై పొన్నూరు పట్టణంలో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.

పూర్ణప్రజ్ఞాచారికి ఉగాది పురస్కారం

తెనాలి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరుకు చెందిన మధురకవి నూతక్కి పూర్ణప్రజ్ఞాచారికి ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యే గల్లా మాధవి పలువురు ప్రముఖుల నుంచి ఈ పురస్కారం అందుకున్నారు.

రంజాన్ శుభాకాంక్షలు

పొన్నూరు టౌన్ మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మానవత్వం, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. నెలవంక దర్శనమిచ్చిన నాటి నుంచి నెల రోజులపాటు ఉపవాసదీక్షలు ఆచరించిన ముస్లింల ఉపవాస దీక్షలు విరమించి ఖురాన్‌లో బోధించిన నీతి సూక్తులను ఆచరించడం ద్వారా భగవంతు డు అల్లా ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని రూరల్ మండలం నందివెలుగులో ఆదివారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సమితి ఆశయాలను వివరించారు. యోగేశ్వరస్వామి రచించిన గ్రంథాలపై అవగాహన కల్పించారు. ఉగాది పండుగ విశిష్టతను వివరించారు. కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కృష్ణారావు, రామకృష్ణ, హరిబాబు, సుబ్బారావు, మహాలక్ష్మి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి తిరునాళ్ల

తెనాలి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని నాజరుపేటలోని స్వామి వారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కత్తెర సురేష్‌కుమార్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాజరుపేటలో మన ఇల్లు వృద్ధాశ్రమంలో శ్రీవెంకటేశ్వర యోగ సేవ కేంద్రం ఆధ్వర్యంలో సభ్యులు యడ్ల విద్వాన్స్ శ్రీసత్య, యడ్ల విశ్వజ శ్రీసత్యల పుట్టిన రోజును పురస్కరించుకుని ఆశ్రయం పొందుతున్న వారికి అన్నదానం పండ్లు పంపిణీ చేశారు. ముద్ద భక్తుని రమణయ్య, వేమూరి గోపాలరావు, దీక్షిత, అనూష, ఆశ్రమ నిర్వాహకులు మురళి, భారతి, పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

కోదండ రామాలయం వద్ద చలివేంద్రం ప్రారంభం

పొన్నూరు టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని తెలగపాలెం, కోదండ రామాలయం వద్ద ఆదివారం మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలి వేంద్రం ప్రారంభించారు. ఫైర్ ఆఫీసర్ ప్రసాదరావు అల్లం సాంబశివరావు చలి వేంద్రంను ప్రారంభించి పాదచారులకు నీరు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్, హనుమయ్య, సింహాద్రి, పోలిశెట్టి విజయ్‌కుమార్, సురేష్, అనిల్ నాయుడు, మేఘనాథ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఎడ్ల పందేలు

● బుర్రా సాయిమాధవ్



వేదికపై ప్రసంగిస్తున్న బుర్రా సాయిమాధవ్

తెనాలి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న సంస్కృతి, సంప్రదాయాలను తిరిగి బ్రతికించేలా తెనాలిలో ఎడ్లబల ప్రదర్శన పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని సినీమాటల రచయిత బుర్రా సాయిమాధవ్ అన్నారు. ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన, పశువుల పోటీలకు రెండోరోజు ఆదివారం సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి, దివంగత ఆలపాటి శివరామకృష్ణయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సాయిమాధవ్ మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో కన్వీనర్ నక్కా ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో రైతుల్లో ఉత్సాహం, విజ్ఞానం నింపేలా తెనాలి ప్రాంతంలో జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పూర్వీకుల నుంచి మనకు అనేక సంప్రదాయాలు అందిపుచ్చుకున్నామని నేటి యాంత్రిక యుగంలో ఒకొక్కటిగా కనుమరుగైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి వాటిని కాపాడుకుంటూ నేటి తరానికి కూడా వాటిని అందిపుచ్చుకునేలా ఎడ్ల బలప్రదర్శన నిర్వహించడం గొప్పవిషయమన్నారు. అందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. తెనాలిలో జరిగే ఎడ్ల బల ప్రదర్శన పోటీలను వీక్షించేందుకు వచ్చిన వేలాది మందిని చూస్తుంటే పండుగ వాతావరణంలా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కూడా తెనాలి ప్రాంతంలో ఎడ్ల బలప్రదర్శనలు కొనసాగాలన్నారు. తొలుత కమిటీ సభ్యులు సాయిమాధవ్‌ను దుశ్శాలువాలతో సత్కరించి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు కూటమి నాయకులు, పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న మహిళలు

హనుమాన్ చాలీసా పారాయణం


తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణం ఘనంగా నిర్వహించారు. పారాయణంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మ పంచాంగ పఠనం చేశారు. హనుమాన్ సేవా సమితి పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. జ్యోతిష్య శాస్త్రవేత్త పాలపర్తి శ్రీకాంత్ శర్మ పంచాంగ పఠనం చేశారు. హాజరైన వారికి ఉచితంగా పంచాంగాలు పంపిణీ చేశారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల

తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నాజరుపేటలో లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మునగా మహేష్, వెంకటేశ్వరమ్మ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో హార్వెస్ట్ ఇండియా బిషప్ కత్తెర సురేష్‌కుమార్, ఈదర పూర్ణచంద్, కన్నెగంటి మురళి, కౌన్సిలర్లు దేసు యుగంధర్, పసుపులేటి త్రిమూర్తి, కొల్లూరు శ్రీధర్, సుద్దపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బోసురోడ్డులో శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభం

తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని హనుమాన్ చౌక్‌లో శ్రీరామ నవమి వేడుకలు ఉగాది పర్వదినాన ప్రారంభమయ్యాయి. శ్రీసీతారామ మందిరం, చిట్టి ఆంజనేయస్వామి ఆలయం ఎదుట చలువ పందిళ్లు వేశారు. 93వ వార్షిక నవరాత్ర మహోత్సవాలు ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 10 వరకు నిర్వహిస్తారు. శ్రీసీతారామస్వామి దేవస్థాన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేశారు. ఆదివారం ఉత్సవ కలశ స్థాపన, అంకురారోపణ పూజలను విద్యాధర్, రజిత దంపతులు నిర్వహించారు. భువనగిరి సుబ్రహ్మణ్యశాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. శ్రీనివాస కూచిపూడి నాట్యాలయం ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యం ప్రదర్శించారు. కమిటీ కార్యదర్శి కేవీ సూర్యనారాయణ మూర్తి, బాలగోపాల్, అర్చకులు నరసింహాచార్యులు పర్యవేక్షించారు.



హనుమాన్‌చౌక్‌లో వేసిన చలువ పందిళ్లు

మధుమేహ వ్యాధి బాధితులకు శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శారద

తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని డాక్టర్ శారదా సర్వీసు సొసైటీ భవనంలో ఆదివారం మధుమేహ వ్యాధి బాధితులకు వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200మంది రోగులను డాక్టర్ శారద పరీక్షించి మందులు పంపిణీ చేశారు. షుగర్, బీపీ, బీఎంఐ పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఈసీజీ చేశారు. నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. ఉగాది పురస్కరించుకుని శిబిరంలో పాల్గొన్న రోగులకు అల్పాహారం పంపిణీ చేశారు. మందులతో పాటు ఆహార నియమాలను, వ్యాయామం చేయాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు.

ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి రావాలి

● గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు నాగరాజన్



కళ్లకు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న నాగరాజన్

తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి రావాలని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు నాగరాజన్ కోరారు. రామలింగేశ్వరపేటలో కళ్లకు గంతలు కట్టుకుని ఆదివారం నిరసన తెలిపారు. గాంధీని హత్యచేసిన జనవరి 30 దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలా 30వ తేదీన తాను నిరసన కార్యక్రమం తెలుపుతున్నామన్నారు. మంచి వైద్యం అందక పేదలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో సామాన్యులకు పలు పథకాలలో అధికారులు లంచాలు తీసుకుంటున్నారని, ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమాజ హితమే 'మానవత' ధ్యేయం

● సంస్థ రీజియన్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం

తెనాలి అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సమాజ హితమే మానవత ధ్యేయమని ఆ సంస్థ రీజియన్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం చెప్పారు. ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ కొల సాని రాంచంద్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో సూక్తి నిధి గ్రంథ ప్రచురణకు సాహిత్యవేత్త ముత్తేవి రవీంద్రనాథ్ రూ.50వేలు విరాళం ఇచ్చారు. అనంతరం ఆనందలహరి పేరిట నిర్వహించిన కార్యక్రమంలో మృదంగ వాయిద్యం, సంగీత విభావరి, కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఓంకార ప్రసాద్, పాపోలు వెంకట్, వాసు, సోమయ్య శాస్త్రి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు సూచనలు చేస్తున్న కమిషనర్ శేషన్న

రంజాన్ ప్రార్థనలకు ఇబ్బందులు లేకుండా చూడండి

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిరూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనేందుకు ఈద్గా వద్దకు వచ్చే ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య పనులను మెరుగుపరుస్తూ పరిశుభ్ర వాతావరణం నెలకొల్పాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని కేవీఎస్ఎం స్కూల్ వద్ద ఉన్న ఈద్గా వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు ఇబ్బందులు కలుగకుండా చేపట్టిన పారిశుధ్య పనులను మునిసిపల్ కమిషనర్ శేషన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్మికులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య, మునిసిపల్ అధికారులను సత్కరిస్తున్న ముస్లింలు

పారిశుధ్య సిబ్బంది, అధికారులకు సత్కారం

పొన్నూరు టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా నెల రోజుల పాటు పట్టణంలోని మసీదుల వద్ద పారిశుధ్య విధులలో ఉన్న కార్మికులు, మునిసిపల్ అధికారులను ఆదివారం ముస్లింలు సత్కరించారు. స్థానిక దాహెర మస్జీద్ వద్ద జరిగిన కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లను సత్కరించి పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీలు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



వల్లభరావుపాలెంలో మినీ గోకులం ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

పశు పోషణకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం

● ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు

పొన్నూరు టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పశు పోషణకు ప్రోత్సాహం అందిస్తోందని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెంలో ఆదివారం నూతనంగా నిర్మించిన మినీ గోకులం షెడ్‌ను కూటమి పార్టీల నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పశు పెంపకందారులకు మినీ గోకులం షెడ్‌లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆరు పశువులకు రైతు వాటాగా రూ.23వేలు చెల్లిస్తే రూ.2,30,000 విలువైన షెడ్‌ను ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, గనిపిశెట్టి రామకృష్ణ, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.